


# శ్రీసాయి దర్శన్

సాయిప్రబోధ ప్రచార మాసపత్రిక

| సంపుటి-7 | ఫిబ్రవరి - 2008 | సంచిక 3 |
|---|---|---|

**SRI SAI DARSHAN**

*(SaiPrabhodha Prachar Monthly)*

Editor :
**Raojee**

Associated Editor :
**A. Lakshmi**

**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn in favour of
**SRI SAI DARSHAN**

Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in

**శ్లో॥ వాయు రీనిల మమృతం**
**అభేదం భస్మాన్తగ్ం శరీరమ్ ।**
**ఓంక్రతోస్మర కృతీగ్ం స్మర**
**క్రతోస్మర కృతగ్ం స్మర ॥**

*(ఈశావాస్యోపనిషత్తు)*

**తా॥** *ఈ ఊపిరి అనంతవాయువులో కలిసిపోతుంది. ఈ శరీరం బూడిద అయి నాశనమైపోతుంది. ఓ మనసా ! పరమాత్మను స్మరించు. సమాధిస్థితిలో నీకు కలిగిన మహాఅనుభవాన్ని స్మరించు. మనసా! అనుభవాన్ని స్మరించు.*

# విషయసూచిక


సంపాదకీయం......3
శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన......4
శ్రీసాయిబాబా జన్మరహస్యం......5
షిరిడీ హారతుల ప్రత్యేకత......8
అబ్దుల్ బాబా......16
సుందరీకాండ......18
దత్తాత్రేయుడే షిర్డీసాయి......25
సాయికి భోజనం అందించిన హోటల్ యజమాని......29
శ్రీసాయి దక్షిణ ఎందుకు పుచ్చుకునెడివారు......31
షిరిడీయాత్రకు పోదామా......34
సాయినాథ ఉవాచ......35
అష్టగణపతి క్షేత్రములు......42
శ్రీలలితా సహస్రనామములు......44
సర్వవ్యాధులకు దివ్యౌషధం ధన్వంతరీ మూలమంత్రం......46
ఆధ్యాత్మిక సంపద......47
పరులకు కీడుచేయు కొండెములు చెప్పకు......51
సత్సంగ మహిమ......52
షోడశోపచారపూజ అంతరార్థం......54
వీటిని విడిచిపెట్టాలి......59
వార్తలు......62




## సంపాదకీయం

శ్రీసాయినాథాయనమః

విషయ వస్తువులను పొందాలనీ, అనుభవించాలనీ ఉండే కోరికలే మానవుడికి మనస్సులో ఆందోళనలు కలిగిస్తాయి. ప్రపంచంలో అవే అతడికి దుఃఖహేతువులు. ప్రపంచంలో మానవుడు పొందే సుఖం అతని మనస్సులో వున్న ఆందోళనలకి వ్యతిరేక నిష్పత్తిలో ఉంటుంది. కోరికలను తీసివేసినప్పుడు అతని మనస్సు శాంతస్థితిలో ఉంటుంది. అప్పుడు అతడు నిజమైన శాంతిని, సుఖాన్ని పొందుతాడు. అయితే మానవుడికి ఈ విషయమే తెలియదు. తెలిసినా దానిని నిర్లక్ష్యం చేస్తాడు. తన కోరికల్ని తగ్గించుకునే ప్రయత్నమే చేయడు. దానికి విరుద్ధంగా సుఖసంపాదనకై విషయవస్తువుల్ని వెన్నాడుతాడు. అవి అతని కోరికల్ని పెంచి హృదయంలో ఆందోళనలని ఎక్కువ చేస్తాయి. పరిపూర్ణత్వం చెందిన మానవుడో? ఆత్మానందానుభవంతో రతిచెందుతూ విషయవస్తువుకి ఏ ప్రాధాన్యమూ ఇవ్వడు. అతనికి ఎంతో ఆనందపు లోతులున్నాయి. అందువల్ల పరిసర వస్తువుల వల్ల పరిస్థితుల వల్ల చలించడు. అలాంటి మహాత్ముడికి ఇష్టం వచ్చినట్లుసంచరించ డానికి శాస్త్రాలు స్వేచ్ఛనిచ్చాయి. సామాన్యమానవునికి విధించే నియమాలు నిబంధనలు ఆయనను హద్దుల్లోపెట్టవు. విషయాకర్షణలకి అతడు యే విధంగాను లోను కాడు కాబట్టే అతనికి పరిస్థితుల ననుసరించి స్వేచ్ఛగా ప్రవర్తించే స్వాతంత్ర్యం కలుగుతుంది. ఆత్మానుభవం యొక్క ఆనందంలో కృతార్థుడై నివసిస్తూ అతడు మరియొక లోకంలో ఉంటాడు.

నీ ఆలోచనలని ఆత్మలో నిలబెట్టి పరమానందాన్ని అనుభవించు.

**- రావ్జీ**

## శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

ప్రథమ భాగం- కాకడ ఆరతి 9 (గత సంచిక తరువాత భాగం)

(ఉదయం 5.00గం॥లకు నేయితో ముంచిన చేదివిటీలతో ఆరతి ఇస్తూ ఆలపించు ప్రార్థన)

### ప్రభాత ప్రార్థనాష్టకం

(9) ఈ అష్టస్తుతులను ప్రాభాతమందు
భక్తిప్రేమలతోడ నాలపించగను
భ్రాంతులను దొలగించి వేగ
శాంతి నొసగును సద్గురువు సాయి ▯
అనుచు దెల్పె నీ బాలకునికి
ఈ అష్టస్తుతులను వినయంబు తోడ
అర్పించె భీష్ముడతి భక్తి గలుగ
జయము, జయము, దిగ్విజయము
శ్రీసచ్చిదానంద సాయినాథునకు.
(సమాప్తం)

### శ్రీషిర్డీసాయిబాబాష్టకం

రామేతి శివ కృష్ణేతి ! మారు తేజ మూర్తిభిః । విరాజంతం జగత్సర్వమ్ । సాయినాథం నమామ్యహం ॥ కలియుగే బోద్భవం దేవమ్ । లీలామానుష విగ్రహమ్ । సూక్ష్మేణ మోక్ష సాధ్యంచ। సాయినాథం భజామ్యహం ॥ నింబవృక్ష మిదంవాసమ్ । శిరిడీపుర మందిరం । భక్తానామిష్టదాతారం । సాయినాథం భజామ్యహం ॥ భక్తలోకం రక్షాక్షితారం । సర్వాభరణ భూషితం । దివ్యమంగళ మూర్తించ । సాయినాథం నమామ్యహం ॥ సమ్మోహనం సుందరాంగం । విశాలాక్షం సువక్షసం । శాంతిరూపయుతం దేవం। సదాధ్యానం కరోమ్యహం॥ సాయినాథ నమస్తుభ్యం । సతతం మోహనప్రియ । నిర్విఘ్నం కురుమేదేవ । సర్వకార్యేషు సర్వదా ॥ రూపం దేహి, జయం దేహి, యశోదేహి ద్విషోజహి । పుత్రాన్ దేహి, ధనం దేహి । ఆరోగ్యం దేహిమ్ ప్రభో ॥ భక్తితోకైక రక్షితామ్ । విభూతిర్ భస్మకల్పకం । భక్తి మత్ సేవితం నిత్యం । ఆయురారోగ్య వర్ధనం ॥



## శ్రీసాయిబాబా జన్మరహస్యం

సాయిదాసానుదాసు సురేంద్రబాబు, కొవ్వూరు, నెల్లూరు జిల్లా

### బాబా తమ పుట్టుకను గూర్చి చెప్పిన మాటలు



శ్రీసాయిబాబా పుట్టుపూర్వోత్తరాల గురించి, సాయి చరిత్రకారులు వ్రాసినవన్నీ ఉహాగానాలే ! వారు పుట్టిన ప్రదేశం, తల్లితండ్రులు, గురువు యొక్క వివరాలు, 18 సం॥ల వరకు వారు ఎక్కడ పెరిగిందీ మొదలైన వివరాలు ఎవ్వరికీ తెలియవు. వారు బాలయోగిగా మొట్టమొదట షిరిడీలోని వేపచెట్టు క్రింద ప్రత్యక్షమైనట్లు మాత్రం అందరికి తెలుసు. కొందరు భక్తులు వారి పుట్టుకను గూర్చి వారినే అడిగినప్పుడు "ఆకాశంలో మేఘాలు గర్జించగానే భూమిపై వర్షం కురిసినట్లు నేనుద్భవించాను. నేను నిర్గుణుడను, నిరాకారుడను. నాకు ఊరు, పేరు లేదు. కర్మబంధంవల్ల పిండరూపుడనై ఈ దేహం ధరించాను. ఈ చరాచర విశ్వమే నా ఊరు. బ్రహ్మయే నన్ను పుట్టించిన తండ్రి. మాయ నా తల్లి. వారి సంయోగంవల్ల సాకారమైన ఈ దేహం ప్రాప్తించింది! అని జవాబు చెప్పేవారు. ఇలాంటి మరో సందర్భములో "నన్ను కన్నప్పుడు నా తల్లి ఎంతో

సంతోషించి ఉప్పొంగిపోయింది. ఆమె ప్రవర్తనకు నేనాశ్చర్య పోయాను. అసలు ఆమె నన్ను కన్నదెప్పుడు? అసలు నేను పుట్టానా? అంతకు ముందు మాత్రం నేనులేనా?" అని చెప్పేవారు. బాబా ఈ మాటలు అద్వైతభావంతో ఆత్మ అమరమని, మరణం దేహానికే గానీ, ఆత్మకు కాదని, మర్మంగా చెప్పి ఉండవచ్చునని కొందరి అభిప్రాయం) . మరో సందర్భంలో బాబా "నేనే పర్వర్దిగర్ (నేను భగవంతుడను). నేను సర్వాంతర్యామిని, ఈ చరాచర విశ్వంలో నేనున్నాను" అని చెప్పేవారు. తమకు పుట్టుకే లేదని ధ్వనించేరీతిలో, ధూలియా కోర్టు న్యాయమూర్తి ముందు, తమ వయస్సు లక్షల సంవత్సరాలని, తమ మతం కబీరని, తమ కులం దైవత్వమని చెప్పారు. ఇలా బాబా వివిధ సందర్భాలలో వివిధ రీతులుగా మాట్లాడేవారు. తమ పుట్టుకను గూర్చి బాబా మాట్లాడిన మరికొన్ని మాటలు దిగువ ఇవ్వబడ్డాయి.

- "మేము సేలు నుండి వచ్చాం! "
- "నేను ఔరంగాబాద్ నుండి వచ్చాను. నా మామ నన్నిక్కడకు తీసుకొచ్చాడు."
- "నా తల్లిదండ్రులు పత్రీకి చెందిన యజుర్వేద బ్రాహ్మణులు"
- "నేను కబీరును. పూర్వం గుడ్డలు నేసేవాడిని, మా వంశం మోమిన్"

తమ గురువును గురించి బాబా మాట్లాడిన మాటలు :

- "నా గురువు బ్రాహ్మణుడు. నా గురువు కబీరు"
- "నా గురు సమాధి షిరిడిలో ఉంది"
- తమ గురువు "వెంకుసా" అని ధూలియా కోర్టు న్యాయమూర్తికి, "రోషన్‌షా" అని మరికొంత మందికి చెప్పారు.




ఇలా బాబా చెప్పే మాటలు ఒకదానికి ఒకటి పొంతన లేకుండా ఉండేవి. కానీ ఏ మాటలు తమని గురించి చెప్పారో, ఏవి ఇతరులతో తాదాత్మ్యం చెంది చెప్పారో తెలుసుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే బాబా ఎన్నో సందర్భాలలో ఎదుటవారితో తాదాత్మ్యం చెంది, వారి విషయాలు తమకు అన్వయించుకొని, ప్రథమ పురుషంలో మాట్లాడేవారు. ఇలాంటి రెండు ఉదాహరణలు క్రింద యివ్వబడ్డాయి.

1. అక్కల్‌కోట న్యాయవాది సపత్నేకర్ భార్య బాబాను మొదటసారిగా దర్శించింది. అప్పుడు బాబా "నన్ను ఎంతో కాలంగా బాధిస్తున్న కీళ్ళనొప్పులు, నడుమునొప్పి క్షణంలో మటుమాయమయ్యాయి" అన్నారు. బాబా నోటి నుండి ఈ మాటలు వెలువడిన వెంటనే, ఆమె నెంతో కాలంగా బాధిస్తున్న కీళ్ళనొప్పులు, నడుమునొప్పి క్షణంలో మాయమయ్యాయి. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు.
2. ఇలాగే మరో భక్తుడు బాబాను దర్శించిన వెంటనే అతనిని పాతికేళ్ళుగా బాధిస్తున్న తలనొప్పి మాయమయింది. అప్పుడు కూడా బాబా "నన్ను పాతికేళ్ళుగా బాధిస్తున్న తలనొప్పి క్షణంలో మటుమాయమయ్యింది!" అన్నారు.

ఆ ఇద్దరు భక్తులు తమ అనుభవాలను తర్వాత ఇతర భక్తులతో చెప్పి ఉండకపోతే బాబా అన్న మాటలలోని అంతరార్థం ఎవ్వరికీ తెలిసిఉండేది కాదు కదా ! మర్మగర్భితంగా ఉండే బాబా మాటలు ఒక్కొక్క భక్తుడు ఒక్కొక్క విధంగా అర్థం చేసుకొని వ్యాఖ్యానిస్తూ ఉండేవారు. అందువల్ల జన్మ వృత్తాంతం ఫలానిదని చెప్పడానికి సాధ్యం కాదు. (దాసగణు రూపకల్పన చేసిన సేలూ కథ 2008 మార్చి సంచికలో చూడండి.)

# షిరిడీహారతుల ప్రత్యేకత



**ఆలూరు గోపాలరావు,** పొన్నూరు, గుంటూరుజిల్లా



జోడునియా కరచరణీ ఠేవిలా మాథా ।
పరిసావీ వినంతీ మా ఝీ పండరీనాథా ॥

చేతులను జోడించి నా శిరస్సును నీ పాదములపై యుంచినాను. ఓ పండరీనాథా ! ఓ సద్గురు సాయినాథా ! నా యొక్క ప్రార్థనను వినుము.

శ్రీషిరిడీ సాయిబాబాను సేవించు విధానములో ముఖ్యమైనది హారతి. షిరిడీ దర్శించు సాయిభక్తులు అప్పుడే కాదు. ఇప్పుడును ఈ హారతులలో పాల్గొనుటకే ప్రాధాన్యత ఇచ్చుచున్నారు. ఈ హారతులను నిర్ణీత సమయములలో నాలుగువేళలా యిస్తారు.

ఈ హారతులు ప్రతిరోజు ఉదయం 5.15 ని॥లకు కాకాడహారతి, మధ్యాహ్నం గం.12.00 లకు మధ్యాహ్నహారతి, సాయంత్రం గం.6.15 ని॥లకు (సూర్యాస్తమ సమయమును బట్టి ఈ సాయంత్రపు హారతి సమయము మారును.)సంధ్యా హారతి, రాత్రి గం.10.00లకు శేజహారతి షిరిడీలో శ్రీసాయినాథుని సమాధిమందిరములో యిచ్చుచున్నారు.

1908వ సం॥లో రాధాకృష్ణమాయి కృషి వలన బాబా సముఖములో ఈ హారతులు యిచ్చుట ప్రారంభమైనది. మొదటగా 1908 నుండి



మేఘుశ్యాముడు, అతని మరణానంతరము బాపూ సాహెబ్ జోగ్ నిత్యము సాయిసన్నిధిలో ఈ హారతులు యిచ్చినారు. 1910 డిసెంబరు 10వ తేదీనుండి చావడిలో రోజు మార్చి రోజు రాత్రి శేజ్‌హారతి, ఉదయం కాకడహారతి యిచ్చుట ప్రారంభించినారు. యిప్పుడు అన్ని హారతులు సమాధిమందిరంలోనే యిచ్చుచున్నారు.

ఈ హారతుల పాటలు బాబాయే వ్రాసుకున్నారని చెప్పవచ్చు. 1908లో కృష్ణారావు జోగేశ్వర భీష్మ బాబాను దర్శించినప్పుడు అతని శిరస్సుపై బాబా తన చేయినుంచి, ఆశీర్వదించగనే అతనికి దివ్యమైన పారవశ్యము కలిగినది. “ఐదు లడ్డూ లివ్వమ”ని బాబా భీష్మను కోరెను. మఱురోజు ఉదయం భీష్మలో కవిత్వము పెల్లుబికి ఐదుపాటలు వ్రాసి, ద్వారకామాయికి వచ్చి, ఆ పాటలను బాబా ముందుంచినాడు. బాబా ఆ పాటలను భీష్మచే పాడించి మఱలా అతని తలపై చేయిపెట్టి ఆశీర్వదించగనే, భీష్మకు స్ఫూర్తికలిగి పాటలను ధారగా వ్రాసి బాబాకు వినిపించినాడు. దాసగణు మహరాజు కొన్ని పాటలు, ఉపాసనీబాబా సంస్కృతంలో కొన్ని పాటలు వ్రాసినారు. “ఆరతి సాయిబాబా” అనే పాటను మాధవరావు అడ్కర్ అనే భక్తుడు వ్రాసినాడు. నానాసాహెబ్ చాందోర్కర్ ఈ పాటలు పరిశీలించి సరిగా యున్నవంటేనే హారతులలో చేర్చేవారు.

ఈ హారతులకు బాబా కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు వారి లీలలను బట్టి స్పష్టముగా తెలియుచున్నది. ఈ హారతుల సమయంలో మాత్రం బాబా తన ఆసనముపై ప్రశాంతముగా కూర్చునేవారు. ఎంతో ప్రసన్నంగా యుండేవారు. మధ్యాహ్నహారతి అయిన తరువాత బాబా మసీదు బయటకు వచ్చి, రోడ్డుప్రక్కన మశీదు గోడకు ప్రక్కన నిలుచుండి ప్రేమతో దయతో

భక్తులకు ఊధి ప్రసాదము పంచిపెట్టేవారు. బాబా భక్తుల చేతులలో ఊధిపోయుచూ, ఆ భక్తుని నుదుటిపై తన చేతిలోని ఊధిపెట్టేవారు. అప్పటి భక్తులు ఎంత అదృష్టవంతులో కదా ! బాబా హస్త స్పర్శను అనుభవించినారు. "అన్నా ! మధ్యాహ్న భోజనమునకు పొమ్ము". "బాబా! బసకుపో." "బాపూ! భోజనము చేయుము." అని ప్రతిభక్తుని సాయిబాబా ఆదరముగా పలుకరించి పంపేవారు. ఈ హారతులు పూర్తి అయిన తరువాత భక్తులు బాబా పాదతీర్థమును తీసికొనేవారు.

ఈ హారతులు సంస్కృతము, మరాఠీ, హిందీభాషలలో యున్నవి. ఈ హారతి పాటల అన్నింటిని "సాయినాథుని సగుణోపాసన" అనెడి పుస్తకరూపముగా దాదాసాహెబ్ కపర్దే తన స్వంత ఖర్చులతో ఆనాడే ముద్రించినారు. 1923 తరువాత సాయి సంస్థానము ముద్రించుచు భక్తులకు అందించుచున్నది.

బాబా ఈ హారతులలో పాల్గొనుటకు ప్రోత్సహించేవారు. ఒకసారి భక్తులు హారతి ప్రారంభించబోవుచుండగా సాయి "హారతి కొంచెం ఆగి ప్రారంభించండి" అని ఆదేశించారు. కారణమడిగిన భక్తులతో " ఆ టాంగావాడు జాగు చేస్తున్నాడు" అని అన్నారు. కొద్దిసేపట్లో ఒక టాంగా వచ్చి ఆగింది. ఆ టాంగాలో వచ్చిన ఒక భక్తుడు ఈ హారతులలో పాల్గొన్నాడు. ప్రయాణంలో ఆలస్యము జరిగినా ఆ భక్తునికి హారతులలో పాల్గొనే అవకాశం బాబా కల్పించారు. ఇంకొకసారి ఒక భక్తుని బాబాయే భోజనానికి పంపారు. ఆ భక్తుడు వచ్చేంతవరకు ఆరతిని ప్రారంభించనీయలేదు. అతడు భోజనం చేసి వచ్చి ఆరతిలో పాల్గొన్న తరువాతనే ఆరతిని ప్రారంభించారు.

జామ్నేరులో నానాసాహెబ్ చాందోర్కర్ కుమార్తె మైనతాయి



ప్రసవవేదన పడుతు సుఖప్రసవమగు పరిస్థితి లేనప్పుడు, ఊధి తన వద్ద అయిపోయిన ఆ సమయంలో నానా సాహెబ్ జామ్నేరులోనే వుండి బాబాను తలచుకోగానే బాబా షిరిడీలోనే యుండి రాంగిరిబువ చేత ఊధి మఱియు "ఆరతి సాయిబాబా..." అనే పాటను వ్రాయించి యిచ్చి పంపగా, మైనతాయికి ఆ ఊధిని నీటిలో కలిపి యిచ్చి ఆరతి పాట పాడగానే ఆమె సుఖప్రసవమైనది. హారతి పాట యొక్క ప్రత్యేకత ఇచ్చట చూపినారు.

మసీదులో హారతి ఎట్లు జరుగుచుండెననునది ఈ క్రిందిలీలలో గమనించుదము. సాయిబాబా జీవితచరిత్ర 18-19 అధ్యాయాలలో శ్యామా హేమాడ్‌పంత్‌కు శ్రీమతి రాధాబాయి అను ముసలమ్మ కథను చెప్పెను. అదేసమయమందు మసీదులో గంట మ్రోగెను. మధ్యాహ్నహారతి ప్రారంభమయ్యెనని గ్రహించిరి. బాపూసాహెబ్ జోగ్ అప్పుడే హారతి ప్రారంభించెను. స్త్రీలు మసీదులో నిండిరి. దిగువ ఖాళీజాగాలో పురుషులు నిండిరి. అందరు బాజాభజంత్రీలతో నొకేవరుసలో హారతిపాట పాడుచుండిరి. బాబాకు కుడివైపున శ్యామా, ముందర హేమాడ్‌పంత్ కూర్చుండిరి. గంటలచప్పుడు, మద్దెల శబ్దము, పాటల ధ్వని హారతి పూర్తయ్యెను. "శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై" అని జయ జయ ధ్వనులు చేసిరి. హారతి పూర్తికాగానే ప్రసాదము పంచిపెట్టిరి. బాబాకు నమస్కరించి బాపూసాహెబ్‌జోగ్ బాబా చేతిలో కలకండ ముక్కను పెట్టెను. బాబా దానిని హేమాడ్‌పంత్ చేతిలో పెట్టెను. బాబా సముఖంలో హారతి ఎలా జరిగెడిదో పై సంఘటన, మనకు కొంత అవగాహన కలిగించగలదు. ఇది 1917లో జరిగిన సంఘటన.

ఈ హారతులకు మానవులే కాదు. జంతువులు కూడా ఎలా ఆనందపడేవో తెలుసుకుందాం. ద్వారకామాయిలో హారతి ప్రారంభ సమయమునకు అందముగా అలంకరించబడిన శ్యామకర్ణా ముందు హాలులో ప్రస్తుతము తాబేలు బొమ్మ యున్న ప్రాంతములో ఉండి హారతి పాటకు లయానుసారముగా శిరస్సు నూపుచు, కాళ్ళాడించేది. హారతి పూర్తికాగానే ద్వారకామాయి మెట్లపై తన ముందు కాళ్లనుంచి బాబాకు వంగి నమస్కారము చేసేది. బాబా ముందుగా ఆ గుర్రము నొసట ఊధి పెట్టి దీవించిన తరువాతనే యితరులకు ఊధి నిచ్చేవారు. ఆ గుర్రమునకు ఉన్న భక్తి మనకు లేదేమోననిపిస్తుంది. యిప్పుడు చాలా చోట్ల సాయి మందిరములలో హారతి జరుగుచున్నా ఆ మందిర నిర్వాహకులు ఆ హారతిలో పాల్గొనక బయట పిచ్చాపాటి కబుర్లతో కాలక్షేపము చేయుచుండుట చూడవచ్చు. ఇది యదార్థము కాదంటారా? తానాచరించి పదిమందిచే ఆచరింపచేయుటయే సాయి పద్ధతి. ఇది గమనించగలరు.

బాబా తర దేహత్యాగము, తన అవతార సమాప్తి కాదని నిరూపించుటకు ఈ హారతులను కొనసాగించుటకు ఎట్లు ఆదేశములు ఇచ్చారో తెలుసుకుందాం. బాబా తన పవిత్ర దేహమును త్యాగము చేసిన మఱురోజు అనగా అక్టోబర్ 16,1918, బుధవారము ఉదయము శ్యామా మేనమామయగు లక్ష్మణమామ జోషికి స్వప్నములో బాబా కనుపించి, చేయిపట్టిలాగి, "త్వరగా లెమ్ము! బాపూ సాహెబ్ నేను మరణించితి ననుకొనుచున్నాడు. అందుచే నతడు రాడు. నీవు పూజచేసి కాకడహారతినిమ్ము" అని చెప్పిరి. సనాతనాచారపరుడైన లక్ష్మణమామజోషి పూజాద్రవ్యముల పళ్ళెము చేత ధరించి మౌల్వీలు ఆటంకపరచుచున్నను లెక్కించక బాబా స్వప్నములో చెప్పిన



ప్రకారము ఆ నిర్జీవదేహమునకు కాకడహారతి యిచ్చినాడు. మధ్యాహ్నహారతికి బాపు సాహెబ్ జోగ్ అందఱితోను మామూలుగా వచ్చి హారతి యిచ్చిరి. బాబా తన అవతార సమాప్తి కాలేదని చెప్పినా బాబా తత్త్వములో గురువులగుట ఎంతవరకు సమంజసమో తెలియకున్నది. ఆ విధముగా బాబా తన హారతులను నిరంతరము ఈయవలసినదిగా ఆదేశించి యిప్పించుకొనుచున్నారు.

ఈ హారతులు సంస్కృతము, మరాఠీ, హిందీభాషలలో వున్నవి. వాటి అర్థమును తెలుసుకొని హారతి పాడిన ఇంక ఎంతయో ఆనందము కలుగును. ఇందులో బాబా గొప్పతనమును, మహిమలను చెప్పుకుంటూ మన మేలు కొరకు అనేక విధముల ప్రార్థిస్తాము. ప్రపంచములో ఎవరు వదలిపెట్టినా మీరు మాత్రం వదలవద్దని బాబాని వేడుకుంటాము. ఇలా ఇందులో ప్రతి హారతి శ్లోకమునకు తెలుగు తాత్పర్యములతో చాలా పుస్తకములున్నవి. అట్టి పుస్తకము 96 పేజీల ప్రింటు రేటుకు పుస్తకం రూ.6/-లకు సాయిబాబా మందిరం, సాయినగర్, పొన్నూరు, గుంటూరు జిల్లాలో లభ్యమగును. కావలసినవారు తెప్పించుకొనవచ్చును.

ప్రతిరోజు సాయంత్రం గం.6-15 ని॥లకు ఇచ్చే హారతికి ఒకే వత్తితోను, మిగిలిన మూడు మారతులకు ఐదువత్తులతోను ధూప, దీప, నైవేద్యములు పెట్టి హారతులు యిచ్చెదరు. షిరిడీలోనే కాక ప్రతి సాయిమందిరములోను ఈ హారతులు యిస్తూవుంటారు. కొన్ని వేల గొంతులు ఒకే సమయంలో సాయినాథుని ప్రార్థించుట లోకకళ్యాణమునకు నిదర్శనము. తల్లిని ఒక బిడ్డ పిలిస్తే ఏలా పలుకుతుందో, కొన్నివేల బిడ్డల పిలుపు ఒకేసారి వినే సాయి తల్లి ఎందుకు ఊరుకుంటుంది. ఒకేసారి పాడు హారతుల వలన

భక్తితరంగములు పవిత్రత పెంచును.

తన భక్తులు ఉదయం గం. 5-00లకి అనగా బ్రాహ్మీముహూర్తము లోనే లేవవలెనని, లేస్తూనే తన చింతనతో కాకాడహారతిలో పాల్గొనుట, వైద్యుడు రోగికి ఆరుగంటకొకసారి మందులు యిస్తూ ఆరోగ్యవంతుని చేసినట్లు, తన నుండి తనను ఆశ్రయించిన భక్తుని మనస్సుకు మరలకుండునట్లు యీ హారతులు మధ్యాహ్నం గం. 12-00లకు, సాయంత్రం గం. 6-00లకు ఏర్పాట్లుచేసి రాత్రి గం. 10-00ల హారతిలో తనను మనస్సునందు నిలుపుకొని పరుండునట్లు చేసి, భ్రమరములా మన చుట్టూ పరిభ్రమించు సాయిలీల లేమని తెలుసుకొనగలము.

సాయిమందిరములలోనే కాదు, యిండ్ల వద్ద కూడ ఈ హారతులు యిచ్చు భక్తులెందరో కలరు. వారు సాయి అనుగ్రహముతో కోర్కెలు తీర్చుకొనుట సాయిభక్తులకు తెలిసినదే. కొందరు ఉద్యోగులు, వ్యాపారులు మొదలగువారు నియమముగా ఈ హారతులు యివ్వ లేనివారు, వారు ఎక్కడవున్నా ఆ సమయములో హారతుల పుస్తకముతీసి మనస్సులో చదువుకొనుట కలదు.

షిరిడీలో ప్రతిరోజు ఉదయం గం. 5-15లకు కాకాడహారతి ప్రారంభమునకు ముందు గం. 5-00లకే ఎల్. పి. రికార్డు ద్వారా వినిపించు మూడు పాటలు సాయి భక్తులను తన్మయత్వము చేయుననుట అతిశయోక్తి కాదు.

1. ఉఠా - ఉఠా సకళజానా 1. ఘనాశ్యామసుందరా అనే పాటను వింటుంటే ఆ ప్రభాత సమయములో ఎంత ఆహ్లాదముగా యుంటుందో అనుభవించుటేకాని చెప్పలేము.

ఇంత పవిత్రమైన హారతులను అన్ని సాయిమందిరాలలో నిర్ణీత



సమయములలో తప్పక ఇచ్చే ఏర్పాటు చేయగలరు. ప్రతిదానికి "ఎడ్జెస్టుమెంటు' ఒకటి మనందరికి కనుపించుచున్నది. బాబా 'ఎడ్జెస్టుమెంటు' ఎరుగనివారు. "ఒప్పుకున్నప్పుడు ఏ పనైనా సరిగా చేయలేకపోతే ఒప్పుకోకు" అనేదే బాబా విధానము కదా ! ఈ హారతులు యిచ్చేటప్పుడు ఎంతో ప్రశాంతంగా యుండాలి. మందిర నిర్వాహకులు ఆ సమయంలో అచ్చటవున్నవారు విధిగా హారతిలో పాల్గొనాలి. తన కోసం కాదన్నట్లుగా వుండరాదు.

ఇది ఒక్కటే నిర్ణీత సమయంలో జరిగే కార్యక్రమము. పదిమంది పాల్గొనాలనే తాపత్రయం పడే కార్యక్రమం. ఎన్ని మందిరాలలోనో బాగా జరుగుచున్నవి. కాని యింకా కొన్ని చోట్ల ఈ హారతులకు తగు ప్రాధాన్యత యిచ్చుట లేదు. ఇది చాలా బాధాకరమైన విషయం. మందిర నిర్వహకులు తగు శ్రద్ధ తీసుకోవాలి. భక్తులకు ఆదర్శంగా వారే హారతులలో ముందు పాల్గొనాలి. ఈ హారతుల ప్రత్యేకతను అందరు తెలుసుకోవాలి.

అన్ని సాయిబాబా మందిరములలో ఈ నాలుగు వేళలా హారతులు నిర్ణీత సమయములలో అందరు పాల్గొని యిస్తూ సాయినాథుని అనుగ్రహమునకు పాత్రులు కాగలరని ఆశించుచున్నాము.

**జయా మనీ జైసాభావ । తయా తైసా అనుభవ ।**
**దావిసి దయాఘనా । ఐసి తురీఘిహిమావ ।**
**తురీఘిహి మావ ఆరతి సాయిబాబా**

తా॥ ఎవరి భావము ఏలా యుంటే అలా అనుభవమిస్తున్నావు. ఓ దయాఘనా ! యిదే మా విధానము. ॥ ఓ సాయిబాబా నీకు ఆరతి ॥

ఓం శ్రీసాయిబాబా

గురుదేవ దత్త

# అబ్దుల్ బాబా

**చరణ్ జనమంచి**



**అ**బ్దుల్ తపతీనదీ తీరంలో ఉన్న నాందేడ్ నివాసి. 'ఫకీర్ అమీరుద్దీన్' అను సాధువును సేవించేవాడు. సాయిబాబా ఫకీర్ అమీరుద్దీన్‌కి స్వప్న దర్శనమిచ్చి వారిచేతిలో రెండు మామిడిపండ్లను ఉంచి "అబ్దుల్‌ని నావద్దకు(షిరిడీకి) పంపవలసినది" అని తెలిపెను. మరునాడు 'ఫకీర్ అమీరుద్దీన్' అబ్దుల్‌కు ఆ స్వప్న విషయం తెల్పి, రెండు మామిడిపండ్లను ఇచ్చెను.

అబ్దుల్ తన 20వ ఏట, 1889లో సాయిబాబా దర్శనం చేసుకున్నాడు. అతనిని చూస్తూ "మేరా కావలా ఆలా"(నా కాకి వచ్చినది) అను స్వాగత వచనములతో సాయిబాబా తన వద్దకు అబ్దుల్‌ను చేర్చుకొనెను. అప్పటి నుంచి సాయిబాబా తమ సేవలో ఉండుమని అబ్దుల్‌ను ఆజ్ఞాపించిరి. ప్రతిరోజు మశీదు, దాని ఆవరణము, వీధులు, బాబా సంచరించు ప్రదేశములను అబ్దుల్ శుభ్రం చేయువాడు. అబ్దుల్ లెండీవనములో, మసీదులో, చావడిలో, రోజు నూనె వేసి దీపములు వెలిగించేవాడు.

అబ్దుల్ మసీదులో బాబా దగ్గరకూర్చొని 'ఖురాన్' పఠించేవాడు. అప్పుడప్పుడు బాబా ఖురాన్‌లోని పేజీలు తీసి అబ్దుల్‌ను చదవమని చెప్పేవారు. అప్పుడు బాబా పలికిన మాటలను అబ్దుల్ మరాఠీభాషలో వ్రాస్తూ, ఒక పుస్తకంగా తయారుచేసెను. అబ్దుల్ ఆ పుస్తకం పారాయణచేయుచు తామరపూసలమాల వేళ్ళతో తిప్పుచూ అల్లానామాన్ని ఉచ్చరించేవాడు. అబ్దుల్ ఆ గ్రంథం ఉపయోగించి



ఎందరి ప్రశ్నలకో సమాధానం చెప్పేవాడు. ఆ సమాధానాలు ఎంతో సంతృప్తిగా ఉండేవి.

అబ్దుల్ బాబా 1936లో బి.వి.నరసింహస్వామికి ఆ పుస్తకం చూపెడుతూ, అందు జగత్సృష్టి, దశావతారములు, మారుతీస్తోత్రములు తదితర ఎన్నో ఆధ్యాత్మిక విషయములున్నవిగా తెలియజేసాడు.

లెండీవనములో ఉన్న నందదీపం దగ్గర ప్రతిరోజు రెండు కుండలతో అబ్దుల్ నీళ్లు పెట్టెడివాడు. ఆ సమయమున బాబావద్ద అబ్దుల్ తప్ప ఇంకెవ్వరు అక్కడ ఉండేవారు కారు. బాబా ఏదో స్మరిస్తూ ఆ నీటిని అన్ని దిక్కులవైపు చల్లెడివారు.

బాబా అబ్దుల్‌ని "హలాల్ కూర్ (భంగివాడు) మరియు 'మిరియాంబి' అని పిలిచెడివారు. సాయిబాబా అబ్దుల్‌ని నిద్రతో కాలం వృథా చెయ్యవద్దని చాలా తక్కువగా భుజించమని బోధించారు. బిచ్చమెత్తి అబ్దుల్ తన జీవితమును గడిపేవాడు. బాబాగారిని సేవించుట వలన అబ్దుల్ అందరినీ సేవించిన వాడయ్యెను. అబ్దుల్ ప్రతిరోజు బాబా ధరించిన వస్త్రములను షిరిడీ ప్రక్కన గల వాగులో ఉతికి శుభ్రపరచి ఆరవేసెడివాడు.

సాయిబాబా అబ్దుల్‌కి దూషణరూపమున యిచ్చిన ఆశీర్వాదములు:

1. తేరేకు దరియాకు పార్ ఉతార్ దియా (నిన్ను నదిని దాటించితిని)
2. తేరే మట్టీ సోనా బనాదియా
   ( నీమట్టిని (తనువు) బంగారముగా మార్చాను.)
3. క్యాబడీ మాడీ బాంధియా" (ఎట్టిమహోన్నత భవనం నిర్మించాను.)

ఈ విధముగా సాయిబాబా శుభాశీస్సులకు అబ్దుల్ పాత్రుడయ్యెను.

సాయిబాబా మహాసమాధి అనంతరం అబ్దుల్ దీక్షిత్‌వాడలోను. సమాధిమందిరంలోను నివసించాడు.

(వచ్చే నెలలో మరొక సాయిభక్తుని గూర్చి తెలుసుకుందాం.)

*శ్రీ తిరుమలశెట్టి వెంకట సుబ్బారావుగారు, వ్యవస్థాపకులు, శ్రీషిరిడీసాయిమందిరం, కొవ్వాడ (తూర్పుగోదావరి జిల్లా) వారిచే ప్రచురింపబడిన –*

– ***యం.పి.సాయినాథ్,*** *ఫ్లాట్ నెం.32, సాయినగర్ కాలనీ, గాంధీనగర్, హైద్రాబాద్-80, ఫోన్ : 2753 4805*

*గత సంచిక తరువాత భాగం*

## షిరిడీలో పండుగలు :



రాధాకృష్ణమాయి షిర్డిలో ఒకసారి గోకులాష్టమిని మహావైభవంగా జరిపింది. అప్పటినుండి గోకులాష్టమిని జరపటం ఆచారమై పోయింది.

షిర్డిలో గురుపూర్ణిమ 1909లో మొదలైంది. అంతవరకు గురుపూర్ణిమ జరుగలేదు. ఆ రోజు ఉదయం సాయిబాబాయే స్వయంగా దాదాకేల్కర్‌కు, రాధాకృష్ణమాయికి "పూజ, ఆరతి జరుగుతుంది. తొందరగా రండి" అని కబురు పంపారు. రాధాకృష్ణమాయి గురుపూజకు కావలసిన పూజాసామగ్రిని అప్పటికప్పుడు పంపింది.

1912లో మొదలైన శ్రీరామనవమి ఉత్సవాలకు రాధాకృష్ణమాయి ఏర్పాట్లు చేసేది. ఉత్సవాలకై శొంఠివడ ప్రసాదం తయారుచేసేది. ఊయలను సమర్పించింది.



ఇటువంటి సందర్భాలలో బయటపని అంతా తాత్యాకోతే పాటిలు చేసేవాడు. ఇంటిపని రాధాకృష్ణమాయి చూసేది.

## సాయిభక్తులకు సేవ :


సాయిబాబా తనను దర్శింపవచ్చిన భక్తులలో కొందరిని ఆయి వద్దకు పంపేవారు. వామన్‌రావ్, శ్రీమతి సదాశివ తారాబాయి తర్కడ్, పురందరే, రేగే, శ్రీమతి బిక్కుబాయి మొదలైనవారిని సాయి పంపారు. వారికి కావలసిన భోజనసౌకర్యాల ఏర్పాటు ఆయి చేసేది. వారికి సేవా తత్పరత అంటే ఏమిటో తెలిసేది. అంతేకాక వారు ఆధ్యాత్మిక రంగంలో పురోగమించారు.

ఆమె తనవద్దకు వచ్చిన వారికి అనేక పనులు పురమాయించేది.

వామన్‌తో సాయిబాబాకు ఉపయోగించే వెండి గంగాళాన్ని, ఇటుకపొడి యిచ్చి మెరిసేలా తోమించేది. సాయిబాబా ఫలహారం చేసే వెండిపాత్రలను మట్టితో కాకుండా, బయటనుండి పేడను తెప్పించి శుభ్రముగా తోమించేది. శ్యామకర్ణ అనే గుఱ్ఱం కోసం సజ్జలు నానబెట్టి వాటిని దంపించేది. వట్టివేళ్ళ తడికలను తయారు చేయించేది.

## షిర్డీలోని స్త్రీలు :

"ఆమె స్వయంగా సేవ చేయటమే కాక, ఇతరులతో కూడా భక్తిప్రేమలతో సేవచేయించేది. అనేకమంది స్త్రీలు కూడా మట్టిరాళ్ళు అందించటం, చిమ్మటం, గోతులు త్రవ్వటం, ఊడ్చటం, మొక్కలు నాటటం, కట్టెలు కొట్టడం, మశీదును కడిగి శుభ్రపరచటం, కాగితం పూలు



తయారుచేయటం, జండాలు కుట్టటం మొదలైన పనులెన్నో చేసేవారు. గొప్ప శ్రీమంతుల ఇళ్లనుండి కులస్త్రీలు కూడా వచ్చి తమకు సేవ చేసే అవకాశం లభించింది అని ఆనందించేవారు" అని షిర్డీలో ఎక్కువ కాలం గడిపిన కాకాసాహెబ్ దీక్షితు వ్రాశారు.

**ఆధ్యాత్మికం :**

ఆమె తన వద్దకు చేరిన భక్తులకు ఆధ్యాత్మిక రహస్యాలను తెలిపేది.

వామనరావు పరీక్షలను గురించి బెంగపడ్డాడు. భోజనం సహించేది కాదు. షిర్డీలో కూడా అలాగే ఉంది అతని పరిస్థితి. అతను రాధాకృష్ణమాయి వద్దకు వచ్చాడు. ఆ రోజు రాధాకృష్ణమాయి వామన్‌కు ఒక్కొక్క ముద్దను పెడుతూ, సాంఖ్యయోగంలో చెప్పిన తత్త్వాలకు సంకేతంగా భోజనాన్ని ఎలా భావించాలో చెప్పింది. అతనికి 42 ముద్దలు యిచ్చింది. అప్పటినుండి అతనికి అరుచి దూరమైంది. అంతేకాదు. "తత్త్వాల శుష్కజ్ఞానంతో పని ఏమి? ఏ వస్తువులో ఏ తత్త్వం వుందో తెలుసుకొనే శక్తి మనకు ప్రాప్తించాలి. ఉదాహరణకి ఉప్పు, అన్నం మొదలైన వాటిలో ఏ తత్త్వం ఉందో తెలుసుకొనటం అవసరం" అని రాధాకృష్ణమాయి వామన్‌కు తెలియచెప్పింది.

**ఏమి కోరినా సాయిసేవ కోసమే :**

ఆయికి మనోవాక్కాయ కర్మలయందు సాయిసేవయే సర్వస్వం. తనకు ఎవ్వరు ఏమి యిచ్చినా అది సాయిబాబా కొరకే అని ఆమె భావము. ఆమె తన కొరకు ఏమి కోరేది కాదు.





ఒకసారి ఒక పెద్దమనిషి షిర్డీవచ్చి దీక్షిత్‌వాడాలో బసచేశాడు. తన భూములను సాయిబాబాకు యిద్దామని షిర్డీ వచ్చానని చెప్పేవాడు. ఆ పెద్దమనిషి భోజనం ఖర్చు శ్యామా భరించేవాడు. రాధాకృష్ణమాయి సాయిబాబాను ఆ భూములన్ని తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకోనా ? అని అడిగింది. సాయి సరే అన్నారు. శ్యామా, తాత్యా కోతే పాటిళ్ళు కూడా అలాగే అడిగారు. సాయి అందుకు సరే అన్నారు వారితో కూడా. ఆ పెద్దమనిషి స్టాంపు పేపర్లకు వెళ్లి షిరిడీ తిరిగిరాలేదు. ఇక్కడ ఆయి తన పేర భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోనా అని అడిగిందంటే కారణం సాయి సేవకొరకే కదా! ఆమెకు భూములతో అంతకంటే వేరేపని ఏముంది?

ఆయివద్దకు కేవలం సాయిబాబా పంపిన వారే కాదు. ఇతరులు కూడా వచ్చేవారు. పరంజపే, నార్వేకర్ మొదలైనవారు వచ్చేవారు. అలా వచ్చినవారందరిని ఆమె ఎట్టి వర్ణభేదము పాటించక తన గురుబంధువులుగా చూచుకొనేది. ఒకసారి ఒక గవర్నమెంటు సి.ఐ.డి.నటేకర్ అనే మారు పేరుతో షిర్డీ వచ్చాడు. ఆయన ఆయి వద్దకు వచ్చేవాడు. ఆమె ఒకసారి తన నివాసంలో లేకపోతే, అతడు అక్కడే ప్రశాంతంగా హాయిగా ఉండటం వల్ల రోజంతా ఉన్నాడు. అతడు షిర్డీ నుండి వెళ్ళిపోయేటప్పుడు ఒక ధోవతి, ఒక చొక్కా ప్రసాదంగా యిచ్చింది. అందరూ ఆమెకు సాయిబంధువులే !

## అతీంద్రియ శక్తులు

రాధాకృష్ణమాయికి అందరూ సాయిబాబాకు సేవలు చేసే బ్రాహ్మణవితంతువుగానే గుర్తించారు. కేవలం కొద్దిమంది మాత్రమే ఆవిడ అతీంద్రియ శక్తులను గ్రహించారు. రాధాకృష్ణమాయి కూడా కేవలం కొద్దిమందికి మాత్రమే తన శక్తిని చూపించారు.

## సిద్ధులు

రాధాకృష్ణమాయి వామన్‌తో "నీ కఫ్నీ చాలా మురికిగా వుంది. దాన్ని నేను వుతికి పెడతాను. ఈ లోపల నువ్వు స్నానం చేయి" అన్నది. "రెండు ముడతలతో చేసిన ముతక కఫ్నీయిది. మురికిపోతే పోవచ్చుగాని, ఆరటం ఎలా? ఆరతి సమయం కావస్తోంది" అన్నాడు వామన్. "దాన్ని గూర్చి నీవేమి బాధపడకు" అని ఆమె అన్నది. ఆమె కఫ్నీని తీసుకొనివెళ్ళి, అతను స్నానంచేసి ఒళ్ళు తుడుచుకునేలోగా ఉతికి ఆరబెట్టి "ఇదిగో నీ కఫ్నీ తీసుకో" అని యిచ్చింది. ఆమె అంత స్వల్పకాలంలో ఈ పని ఎలా చేయగలిగింది అని ఆశ్చర్యపోయాడు. రాధాకృష్ణమాయి ఎంత సిద్ధురాలో గ్రహించాడు.

## ఋతంబర ప్రజ్ఞ :

సాయిబాబా అనుగ్రహంవలన ఆమెకు కొన్ని సిద్ధులు సంక్రమించాయి. ఎదుటివారి మనసులోని విషయాలు వారు చెప్పక పూర్వమే తెలుసుకొనగలిగేది. రాధాకృష్ణమాయి వద్ద తారాబాయి తర్కడ్ కొంతకాలం వున్నప్పుడు, తారాబాయికి కొన్ని ఉత్తరాలు వచ్చేవి. తారాబాయి ఆ ఉత్తరాలను విప్పి చదువుకొనకముందే



ఆ ఉత్తరాలకు తారాబాయి ఏమి జవాబు వ్రాస్తుందో, ఆ జవాబే రాధాకృష్ణమాయి చెప్పేది.

తారాబాయి గతజన్మ వివరాలను రాధాకృష్ణమాయి చెప్పింది.

## సాయిబాబానుండి ఆజ్ఞలు :

ఆమెకు అప్పుడప్పుడు సాయిబాబా వద్దనుండి విచిత్రమైన ఆజ్ఞలు వచ్చేవి. ఆమెకు ఆ ఆజ్ఞలు సాయి వద్దనుండి ఒక వ్యక్తిద్వారా రాకపూర్వమే ఆమె ఆజ్ఞలను నిర్వర్తించేది.

వామన్ బొంబాయినుండి సాయిదర్శనానికి వచ్చాడు. ఆమె యింట్లో బసచేశాడు. అతని అలవాట్లను అతడు చెప్పకుండానే ఆమె తెలుసుకునేది. ఆమె యింట్లో దిగినప్పుడు "వామన్యా! లే. టీ తయారయింది. ఆరుగంటలయింది" అంటూ ఆమె వామన్ సోదరి అతన్ని నిద్రలేపినట్లు లేపింది. అతని వ్యవహారాలను ఏ మాత్రం అతను చెప్పకుండా గ్రహించి చేయటం సామాన్యులు చేసే పని కాదు. ఆమెతో వామన్‌కు చాలా అనుభవాలు జరిగాయి.

## ఆయి మాటే సాయి మాట :

ప్రతిరోజు వామన్ సిద్ధాసనంలో కూర్చుని ధ్యానంచేసేవాడు. రాధాకృష్ణమాయి వేరే ఆసనం చూపించారు. అది సిద్ధాసనం కాదు. అది స్వస్తికాసనం లేక సహజాసనం. "ఈ ప్రకారం నిటారుగా కూర్చోవాలి" అని ఆమె అన్నది. సాయిబాబాను వామన్ దర్శించినప్పుడు, ప్రతిరోజూ సాయిబాబా కూర్చుండే ఆసనంలో కాకుండా, రాధాకృష్ణమాయి చూపిన ఆసనంలో

కూర్చున్నారు. అంటే రాధాకృష్ణమాయి చూపిన ఆసనాన్ని అనుమసరించమని సాయి భావంగా వామన్ గ్రహించాడు. ఆయి మాటే సాయి మాట.

రాధాకృష్ణమాయి వామన్‌కు ఒక పని అప్పగించింది. కొద్ది రోజులలో ఆయన ఆ పని చేశాడు. ఒక రోజు ఆ పని చేయకుండా, సాయిబాబా దర్బారులోకి పోయి కూర్చున్నాడు. సాయిబాబా అతన్ని దర్బారు నుండి లేపేశారు. వామన్ వెంటనే రాధాకృష్ణమాయి చెప్పిన పని చేశాడు.

రాధాకృష్ణమాయి ఒకసారి వామన్‌ని అన్నం తినడం మానమని చెప్పింది. అదే సమయంలో సాయిబాబా ఆయనకు స్వప్నంలో కనిపించి "రొట్టెలు తింటూ వాటితో ఎర్ర ఉల్లిపాయపచ్చడి తినాలి" అని చెప్పారు. అంటే అన్నంమానమని రాధాకృష్ణమాయి మాటలనే సాయి వామన్‌కు చెబుతూ అన్నం బదులు రొట్టెలు తినాలని చెప్పారు.


ఒకసారి రాధాకృష్ణమాయి వామన్‌ను దర్వాజా వద్ద దీపమాల కట్టడానికి డబ్బు అడిగింది. ఆయన వద్ద డబ్బు లేదు. అదేమాట చెప్పాడు ఆయితో. కొంతకాలం తర్వాత ఆమె మరణించింది. సాయిబాబాను వామన్ దర్శించి "బాబా ! దీపమాల కడదామా?" అన్నారు. సాయిబాబా "ఇప్పుడేమీ అవసరం లేదు" అన్నారు. రాధాకృష్ణమాయి బ్రతికి వున్నప్పుడే ఈ పని అయివుంటే బావుండేది అని వామన్‌కు అనిపించింది. సాయి ఆదేశంతోనే రాధాకృష్ణమాయి తనను దీపమాలకు డబ్బు అడిగారని అప్పుడు వామన్‌కు ఆలోచన కలిగింది. పశ్చాత్తాపం చెందాడు. బాబా మాటలే ఆయి మాటలు!

(సశేషం)



# దత్తాత్రేయుడే శిర్డీ సాయి

**సుంకరి వెంకట సూర్యనారాయణ,** *డోర్ నెం. 2-193.*
*చిన్నగంట్యాడ, గాజువాక (పి.ఒ.), విశాఖపట్నం - 530 026.*



ఈ సృష్టిలో నివశించు 84 లక్షల జీవరాసులలోను మానవజన్మ చాలా పవిత్రమైనది. మానవునకు విజ్ఞానము, మాటలాడే స్వభావము కలవు. కాలచక్రంలోని మానవ జీవితమందు సుఖాలు, దుఃఖాలు వస్తూ, పోతూ జరుగుతూనే వుంటాయి. కష్టాలు వచ్చినప్పుడు భగవంతుని తలుస్తాము. ఇష్టమైన దైవాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, తెలిసియో, తెలియకయో ఆరాధిస్తూనే ఉంటాము.

"దేవుడు అనేవాడు ఉన్నాడా?"అని ప్రశ్నిస్తే అనేక రకాలుగా సమాధానాలు చెప్పుతారు. ఒకరకమైన విడదీయలేని ప్రశ్న నాస్తికులు అసలు దేవుడు అనేవాడు లేడని వాదిస్తే, ఆస్తికులు భగవంతుడు అనేవాడు సర్వము అంతటా నిండియున్నాడు, అందుకు పంచభూతములైన గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశములోనేగాక మరి దైవాన్ని, గుర్తించుటకు చెట్లు, రాళ్లు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు మరియు నంది, గణపతి, హనుమంతుడు, గరుత్మంతుడు, పాము మొదలైన విగ్రహాలలోనే గాక, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాదులతో సహా ఈ సృష్టిలో ఉన్న పిపీలకాది జీవరాసులయందు

ఉండి, ఈ సృష్టికి అధినేతగా, స్థితి లయ కర్తగా తల్లి, తండ్రి, గురువు, దైవం, కర్తా, భర్తా, సంహర్తగా వెలుగొందుతుచున్న సర్వాంతర్యామి అయిన దైవం ఒక్కడే !

దేవుడు ఒక్కడే అని నమ్మినా దశావతారాలు దాల్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించి, యుగయుగాలు ధర్మసంస్థాపనార్థమై అవతారాలు ఎత్తుచుండెను. ఈ కలియుగము నందు అనేక మతాలు ఉద్భవించినవి. హిందువులు భగవద్గీతను, క్రైస్తవులు బైబిలును, మహమ్మదీయులు ఖురాన్ గ్రంథాలను నమ్మి మతాల ఆచార్య వ్యవహారాదులను ఎవరి ఇష్టప్రకారం వారే నిర్ణయించుకొని ఆరాధిస్తారు.

ఈ కలియుగములో (4,32,000 సం॥) ధర్మము మూడు పాదాలు అంతరించి ఒక్కపాదముపైన నిలిచినది. అది కూడా క్షీణదశను పొందుచున్నది. కలి ప్రభావముచే ప్రతీ మనిషి రోగం, శోకం, దుఃఖం, అశాంతి, భయములతో జనన మరణ కాలచక్రములో తిరుగుచున్నారు. ప్రజలలో సత్యాసత్య విచక్షణా జ్ఞానములేక మనసా, వాచా, కర్మణా పాపాలు చేయువారి సంఖ్య ఎక్కువైనది. కామ,క్రోధ,లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గముల బారినుండి తప్పించుకొకలేకపోతున్నారు. కులము, మతము, జాతిభేదములతో రాజకీయ కుట్రలతో అనేక హత్యానేరాలు, దోపిడీలు, అత్యాచారాలు ఎక్కువై ప్రజలలో నీతి కోల్పోయినది. ధర్మముకన్నా సౌఖ్యం మిన్నయని, న్యాయము కన్నా ధనము ముఖ్యమని, ప్రేమకన్నా బలము గొప్పదని, త్యాగము కన్నా శరీరసుఖమే ప్రధానమని, ఆధ్యాత్మికత కన్నా భౌతికం గొప్పదనే ఆలోచనలు నానాటికీ ఎక్కువైపోతున్నాయి.



ఈ కలియుగంలో అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని సిద్ధాంతాలు ఒక్కటేనని ప్రజలకు చాటిచెప్పి తనలో అంతర్లీనము చేసుకొని వసుధైక కుటుంబముగా తీర్చిదిద్ది, ఈ కలిప్రభావాన్ని అంతమొందుటకై తిరిగి సత్యయుగాన్ని స్థాపించు నిమిత్తము మానవరూపములో దిగివచ్చిన యుగపురుషుడు శ్రీసాయి.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, రాజాధిరాజు, యోగిరాజు పరబ్రహ్మస్వరూపుడు, సచ్చిదానంద సద్గురు శ్రీసాయి అవతారవిశిష్టతను తెలుసుకొనుటకు మానవ జన్మ ఎత్తిన ప్రతీ మనిషి ప్రథమ కర్తవ్యంగా స్వీకరించాలి.

శ్రీసాయి జీవితచరిత్ర పవిత్రగ్రంథాన్ని శ్రీసాయి ఆశీస్సులతో హేమాడ్‌పంత్ మరాఠీ భాషలో మొట్టమొదటిసారిగా వ్రాయగలిగారు. దానినే ప్రత్తినారాయణరావుగారు తెలుగులో అనువదించి శ్రీసాయిభక్తులకు అందించగలిగారు. ఇంకా అనేకులు శ్రీసాయి జీవితచరిత్రను వ్రాసి ప్రచార సేవలు అందించి మహాపురుషులు తమ జీవితాలను ధన్యత చేసుకున్నారు.

శ్రీసాయి ఉనికిని గుర్తించాలి అంటే ఎవరి తరము కాదు. జన్మరహస్యం అంతకన్నా తెలియదు. కానీ మూడు రకాల వాదనలు కలవు. అందులో దత్తాత్రేయుడే శ్రీసాయి అనే అంశముపైన మనము ఈనాడు తెలుసుకుందాం.

పూర్వం ఒక కల్పాంత ప్రళయం తర్వాత నారాయణుని నాభికమలం నుండి బ్రహ్మ ఉద్భవించి సనకాదియోగులను, మరీచి మొదలైన సప్తప్రజాపతులను సృష్టించాడు. వారి కుమార్తె దేవహూతి కర్దముని భార్య అయినది. ఆమెకు కల్గిన కుమార్తెలలో అనసూయదేవి అత్రి మహర్షికి భార్య అయినది.

అనసూయాదేవి పతివ్రతా ప్రభావమువలన అత్రి మహర్షి తపస్సునకు మెచ్చి త్రిమూర్తులు వారిని వరము కోరుకొనమంటారు. మీవంటి కొడుకు కావాలి అన్నారు ఆ దంపతులు. అభయమిచ్చారు త్రిమూర్తులు. తమవంటివారు లేనందున తమకు తామే దత్తం చేసుకొన్నారు త్రిమూర్తులు. ఆ రోజు శుక్రవారం కార్తీక బహుళవిదియ, మృగశిర నక్షత్రం మొదటి ఝామున మొదటి గంట. ఆయనయే జ్ఞాననిధి, యోగిజనవల్లభుడు, జగద్గురువు. ఆ దంపతులకు ప్రణమిల్లి తమ గర్భజనకుడైన బిడ్డను సాక్షాత్కరించిన రూపము ఈ భూమిపై దత్తాత్రేయుడుగా ఉద్భవించెను.

***దత్తావతారాలు :***

**శ్రీ శ్రీపాదశ్రీవల్లభ స్వామి (పిఠాపురం)**
**శ్రీ నృసింహసరస్వతి స్వామి (గాణ్గాపురం)**
**శ్రీ మాణ్యిక్యప్రభువు (హుమ్నాబాద్)**
**శ్రీ అక్కల్‌కోటస్వామి (అక్కలకోట)**
**శ్రీ సాయిబాబా (షిరిడీ)**



# సాయికి భోజనం అందించిన హోటల్ యజమాని

సేకరణం : **తిరుమలశెట్టి వెంకటసుబ్బారావు,** కొవ్వాడ,
శ్రీషిరిడీసాయిబాబా మందిరము



సగుణమేరునాయక్ పూనాతాలుకా మార్మగోవాలో బొళ్ళి గ్రామస్థుడు. చిన్నతనములో పశువులకాపరిగా పనిచేసేవాడు. 1911-12 సం॥లో సగుణమేరునాయక్ షిరిడీచేరి బాబాను దర్శించెను. బాబా అతనికి 5 నెలల పాటు సలహాల నిచ్చెను. తను షిరిడి వదలివెళ్ళుటకు బాబాను అనుమతి కోరగా వారు యిలా అనిరి. "ఏదో పని చేసుకుంటూ షిరిడీలోనే ఉండుము. భగవంతుడు నీకు మేలు చేస్తాడు". బాబా ఆజ్ఞానుసారము నాయక్ షిరిడీలోనే ఉండిపోవ నిశ్చయించుకుని ఒక 'టీ' హోటల్ ప్రారంభించెను. ఇది కాక బాబా ఫోటోలు, ఆరతిపుస్తకములు, భక్తికి సంబంధించిన వస్తువులు అమ్మకము చేయుచూ సుఖజీవనము గడుపుచుండెను. అప్పుడప్పుడు మశీదులో చిన్న చిన్న పనులు, దీపములు శుభ్రముచేయుట, దీపాలలో నూనె వేయుట మొ॥వి చేయుచుండెడివాడు.

ఒకసారి ఒక వైశ్య వ్యాపారి పక్షవాతము సోకిన తన కుమార్తెతో వచ్చెను. ఆమె తనంతట తాను నిలబడలేకుండెను. నేలకు చేతులు ఆనించి కదులుచుండెను. ఆమెను బాబావద్దకు ఎత్తుకొని తీసుకొనివెళ్లిరి. మూడు రోజుల తర్వాత ఆమె తనకాళ్ళపై తాను నిలబడగలిగెను. శైసాస్ అను రైల్వేఉద్యోగి భార్య పక్షవాతముతో బాధపడుచుండగా కొద్దిరోజులు బాబా తన కరుణతో నయము చేసిరి. ఈ సంఘటనలు స్వయముగా సగుణమేరునాయక్ అనుభవించినారు.

బాబా ఒకసారి సగుణమేరునాయక్ కలలో కనపడి "మెత్తగా ఉడికిన అన్నము కావ"లెననిరి. అప్పటినుండి రెండు సంవత్సరములు బాబాకు మెత్తని అన్నము సమర్పించబడెను. ఆపై బాబా యీ అన్నములో కొంచెము నెయ్యివేసి తీసుకొని రమ్మనిరి. నాయక్ ఈ విధముగానే చేస్తూ, మొదటిగా కొంచెము ధునిలో వేసి, కొంత అన్నమును బాబా తినే పాత్ర (కొలంబి)లో ఉంచి, మిగిలినది కుక్కలకు వేసేవాడు.

పూనానివాసి గోపాల నారాయణ అంబాడేకర్ ఆర్థికబాధలు భరించలేక నూతిలో పడి మరణించవలెనని నిశ్చయించుకొన్నప్పుడు సగుణమేరునాయక్ అతనిని పిలిచి అక్కల్‌కోటమహరాజు జీవితచరిత్రను చదువమని యిచ్చెను. దీనిని బాబా ఆదేశముగా భావించి ఆత్మ హత్యా ప్రయత్నమునుండి అంబాడేకర్ విరమించుకొనెను.

సాయిని నమ్మనవారికి సాయి ఎప్పుడూ కీడు తలపెట్టడు. వారికీ మంచి చేస్తారు. నమ్మిన వారికి మంచి చేస్తారు.

సాయి శరణం బాబా శరణం బాబా శరణం సాయి శరణం

సశేషం మరల వచ్చే నెల సాయిని కలిసి స్మరిద్దాం



# శ్రీసాయి దక్షిణ ఎందుకు పుచ్చుకొనెడువారు దాని ఆంతర్యం



శ్రీసాయికి యిల్లులేదు, వాకిలి లేదు, భార్యా బిడ్డలు లేరు. పుట్టిననాటి నుండి సన్యాసి, కఠోర బ్రహ్మచారి. అయినచో దక్షిణ ఎందుకు భక్తులవద్దనుండి తీసుకొనెడివారు. ఈ విషయము తెలుసు కొనుటకు కుతూహల ముండుట సహజము.

కొంతకాలము శ్రీసాయి ఎవరివద్దను ఏమియు పుచ్చుకొనెడువాడు కాడు. అటు తరువాత ఎవరినైననూ ఏమి యిచ్చిననూ తిరస్కరించెడివాడు. కాని ఒక్క పైస మాత్రము తీసుకొనెడివాడు. దానితో చిలుముకు కావలసిన పొగాకు తెచ్చుకొనెడివాడు. ఇట్లు జరుగుచుండగా మసీదుకు శ్రీసాయిని దర్శించుటకు వచ్చు భక్తులు అధికమగుచుండిరి. అప్పటినుండి వారిని దక్షిణ అడుగుట మొదలిడెను. వేదములలో రాజును, దైవమును, సత్పురుషులను దర్శించుటకు పోవునప్పుడు రిక్తహస్తములతో పోరాదని చెప్పబడియున్నది. ఉపనిషత్తులలో కూడా యిట్టి విషయము చర్చించబడినది. మానవులకు ధర్మము చేయుట అవసరమని చెప్పబడినది. దాని అర్ధము ధనము నందలి పేరాశ లేకుండజేయుట అని చెప్పుట ఆచారము. దానము చేయునప్పుడు సొమ్ము ఎంత యిచ్చినది ముఖ్యము కాదు. దానిని ఎట్లు యిచ్చెనో ముఖ్యము. అనగా కరుణతోడను, దాతృత్వము తోడను యివ్వవలెను. వీటినన్నింటిని చూడ శ్రీసాయి

భక్తులకు దానము చేయుట యందు ఆసక్తిని పెంపు చేయుటకునూ, ధనమునందు మోహమును నశింపజేయుటకునూ దక్షిణ అడుగుచుండెడివారని చెప్పవచ్చును. శ్రీసాయి యిట్లు చెప్పెడివారు, ***"మీ వద్ద దక్షిణగా పుచ్చుకొను మొత్తమునకు నూరు రెట్లు ప్రతిఫలమును నేను మీకు యివ్వవలయును".*** ఫకీరు (దేవుడు) ఆదేశము లేనిదే ఎవరి వద్దను దక్షిణ పుచ్చుకొనను. ఈ విషయమును తెలియజేయు కథలు చాలా కలవు.

అందు కొన్ని యిందు పొందుపరచినాడు హేమాడ్‌పంత్.

**1. గణపతిరావు బోడాసు కథ :** గణపతి రావు బోడాసు అనునతడు పేరు ప్రఖ్యాతులున్న నటుడు. అతడు తన స్వీయచరిత్రలో శ్రీసాయిదర్శనము, అతని అనుభవములు వ్రాయుచూ "శ్రీసాయి పలుమారు దక్షిణ యిమ్మని అడుగగా నా వద్దనున్న సంచిలో సొమ్ము మొత్తము వారికి యిచ్చితిని. తత్ఫలితముగా నా జీవితాంతము డబ్బుకు కొదువు లేకయుంటిని. ధనము దానంతట నాకు వచ్చెను" అని చెప్పెను.

శ్రీసాయిభక్తులనుండి అడుగు దక్షిణకు యింకొక అర్థము కలదు.

1. ఒక పర్యాయము ప్రొఫెసర్ నార్కే అనునాతనికి శ్రీసాయి రూ. 15 దక్షిణ యిమ్మని అడిగెను. అతడు తద వద్ద సొమ్ము లేదని జవాబు చెప్పెను. అది విని శ్రీసాయి నీవు చదువుచున్న యోగవాశిష్టము నుండి యిమ్మని బదులు పలికెను. తాను చదువు పుస్తకములోని అంశములను జీర్ణము చేసుకొని అందలి పాఠమును తనకు యిమ్మని అర్థము.

2. శ్రీమతి ఆర్.ఎ.తర్కడ్ అను నామెను రూ.6/- దక్షిణగా యిమ్మని శ్రీసాయిని అడిగెను. ఆమెవద్ద ధనములేదని చెప్పగా ప్రక్కనవున్న ఆమె భర్త "నీలోని ఆరు దుష్టగుణములను విసర్జింపుమని శ్రీసాయి అభిమత"మని చెప్పగా



శ్రీసాయి అందులకు సమ్మతించిరి.

శ్రీసాయి దక్షిణగా సొమ్ము భక్తులవద్ద వసూలు చేసిననూ అది అందరకు పంచియిచ్చెను. తన వద్ద ఎప్పుడు వుంచుకొనలేదు. వారు ఫకీరువలె ఉండువారు. వారు మహాసమాధి పొందు కాలమునకు వారి వద్ద కొన్ని రూపాయలు మాత్రము మిగిలియుండెను. అందుచే శ్రీసాయి దక్షిణకోరుట భక్తులను ధనాశనుండి తప్పించి ముక్తిని ప్రసాదించుటకని పలువురి అభిప్రాయము.

ఈ విషయమును గూర్చి బి.వి.దేవ్ అను నాతడు యిట్లు వ్రాసియున్నాడు. అందరివద్దను దక్షిణ పుచ్చుకొనలేదు. కొందరు యిచ్చిన దక్షిణ పుచ్చుకొనుటా, మానుటా అనునది వారి మనస్సుపై ఆధారపడియుండెడిది. తనకు యిష్టము లేకయే దక్షిణ యిచ్చిన వారి వద్ద పుచ్చుకొనలేదు. భక్తుల వద్ద పుచ్చుకొనునప్పుడు వారిని పీడించలేదు. ధనవంతులు, బీదవారు అను వివక్షణ చేయువాడు కాదు. దక్షిణ యిచ్చుటకు శక్తిలేని వారిని కోపగించలేదు. కొందరు దక్షిణ యిచ్చుట మరచిపోయిన వారికి గుర్తుచేసి తీసుకొనువాడు. కొందరకు తాను తీసుకొనిన దక్షిణలోని భాగమును తిరిగి యిచ్చి దానిని దేవమందిరమునందుంచి పూజింపుడని ఆజ్ఞాపించువారు. ఎవరైనను అతి విలువైన కానుకలను యిచ్చినచో వారిని మందలించెడివారు. నా సంసారము నాలుగు వస్తువులు మాత్రము చొక్క, పాత్ర, తలగుడ్డ, చేతికర్ర. అందుచే నాకు కానుకలు అవసరము లేదని వారికి చెప్పుచుండెడివారు.

ఓం శ్రీ సాయిరాం

ఓం సర్వేజనాః సుఖినోభవంతు ఓం శాంతిః శాంతిః శాంతిః

# షిరిడీ యాత్రకు పోదామా

**శిమ్మా పార్వతీశం,**శ్రీసాయిమానస మందిరమ్, ఎందువ, శ్రీకాకుళం జిల్లా.



"షిరిడీ" యాత్రకు పోదామా
"సాయి" సమాధిని చూదామా
"సాయీ! సాయీ!" అందామా
"స్వామి" భజనలూ చెదామా ॥ షిరిడీ ॥

1. "దైవం" మానుషరూపం దాల్చి
ధరణిని "షిరిడీపురము"న నిల్చి
"భక్తులు" కోరిన "కోర్కెలు" దీర్చగ
"ద్వారకమాయి"లో వెలసిన సాయి ॥ షిరిడీ ॥


2. "మత" భేదమ్ముల మత్తున సోలి
మానవత్వమే మదిలో వీడి
పశువులకన్నా పరమనీచమై
పరుగిడు మానవ జాతిని బ్రోవగ ॥ షిరిడీ ॥

3. జీవకోటికి "దేవుడొక్కడే"
పావన "గంగ"కు "భావమొక్కటే"
కల్మషమంతా కడిగేయాలని
"పేదా", "గొప్పా" భేదం ఏలని ॥ షిరిడీ ॥

4. "సహనం" "ప్రేమ" "సమానత్వమే"
"సాయి రూపు"గ దాల్చిందండీ
"మానవసేవే మాధవసేవ"ని
"మానవత్వమే" "మరువకు మా"యను ॥ షిరిడీ ॥

5. నీలో "ఆర్గురు" శత్రువులున్నా (కామ,క్రోధ, లోభ, మోహ మద, మాత్సర్యాలు)
నిరతం మదిలో గమనించన్నా
"గుడ్డలు" మార్చిన "గుణము" మారక
"దీక్షలు" చేసిన ఫలితం "సున్నా" ॥ షిరిడీ ॥





# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మావాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి) (గత సంచిక తరువాయి భాగము)***

***(217) మీ యిల్లు యెవ్వరూ అద్దెకు తీసుకోకుండ, చేతబడి చేశారు.***

బాబా ఒకసారి చంద్రాబాయి బోర్కర్ కలలో కన్పించి" మీ ఇల్లు యెవ్వరూ అద్దెకు తీసుకోకుండ చేతబడి చేశారు. మంత్రించిన నిమ్మకాయ ఒక మూల పాతిపెట్టారు. దాన్ని తొలగించి, నీకులదైవాన్ని పూజించుకో" అన్నారు. ఆమె బాబా చెప్పినట్లుగా, ఆ నిమ్మకాయ తొలగించి, వారికులదైవాన్ని పూజించడం మొదలుపెట్టిన తర్వాత, ఆ యిల్లు చేతబడి నుండి విముక్తి పొందింది. అద్దెకు తీసుకోడానికి ఎంతోమంది వచ్చారు.

***(218) దేవాలయంతో సహా, ఒకవాడా నిర్మించు, భక్తులకోరికలు తీరుస్తాను.***

1916లో దీక్షిత్‌వాడాలోని ఒక గదిలో శ్రీమాన్‌బూటీ, శ్యామా నిద్రిస్తున్నారు, వారిద్దరికి ఒకేసారి, ఒకే విధంగా బాబా కలలో కన్పించి, "దేవాలయంతో సహా ఒకవాడా నిర్మించు, భక్తుల కోరికలు తీరుస్తాను" అన్నారు.

వెంటనే బూటీ, వాడా నిర్మించడానికి పూనుకొని దానిని 1918 కల్లా పూర్తిచేశాడు. అదే ప్రస్తుతం సమాధి మందిరం లేక బూటీవాడా,

***(219) బాపూ, లే, నేను చనిపోయానని తలచి, బాపూసాహెబ్ ఆరతి జరిపించడు, నీవే వెళ్లి కాకడ ఆరతి జరిపించు!***

బాబా 1918 అక్టోబరు 15వతేది, మంగళవారం మ. 2.45గం॥లకు మహాసమాధి చెందారు. బుధవారం వేకువన శ్యామా మేనమామ అయిన లక్ష్మణ్ మామ కలలో బాబా కన్పించి, "బాపూ,లే ! నేను చనిపోయానని తలచి, బాపూ సాహెబ్ ఆరతి జరిపించడు. నీవే వెళ్లి, కాకడ ఆరతి జరిపించు! " అని ఆదేశించారు. లక్ష్మణ్ వెంటనే వెళ్లి, ఆరతి జరిపించాడు.

***(220) మశీదు కూలిపోయింది. నూనె వర్తకులు నన్ను చికాకు పెట్టారు. అందుకే నేను ఆస్థలం విడచి వెళ్లిపోయాను.***

1918 అక్టోబరు 16వతేదీన పండరీపురంలో నున్న దాసగణు కలలో బాబా కన్పించి పై విధంగా పలికారు. దాసగణుకు బాబా సమాధి చెందిన విషయం అంతకుముందే ఉత్తరం ద్వారా తెలిసింది. దాసగణు తన శిష్య బృందంతో శిరిడీ వెళ్లి, సమాధిని "శ్రీహరి" పేరు కుట్టిన పూలపరదాతో కప్పి,భజన కీర్తనా కార్యక్రమాలు నిర్వహించాడు. బాబా పేరున అన్నదానం జరిపించాడు.

***(221) "మహాత్ములు" చనిపోరు, సమాధి చెందుతారు.***



16.10.1918 రాత్రి ఛోటూబాయి ప్రధాన్ బాబా చనిపోతున్నట్లు కలకన్నది. ఆమె భయపడి, "బాబా చనిపోతున్నారు" అని పెద్దగా కేకలు పెట్టసాగింది. అప్పుడు బాబా ఆమెతో "మహాత్ములు చనిపోరు. సమాధిచెందుతారు" అన్నారు.

***(222) నీ సంచిలో నున్న పీతాంబరం, నా సమాధి కప్పేందుకు పంపు !***

17.10.1918 రాత్రి ఛోటూబాయి ప్రధాన్ కలలో, బాబా తిరిగి కన్పించి, పై విధంగా ఆదేశించారు. చాలకాలంగా తన పాతసంచిలో ఉన్న పీతాంబరం గుర్తుకు వచ్చి, దానిని శిరిడీ పంపింది. సంస్థాన్‌వారు దానిని 1923వఱకు, సమాధిని కప్పేందుకు ఉపయోగించారు.

***(223) అమ్మా ! బాధపడకు ! నిన్ను ఉరుసుకు నేను తీసుకెళ్తాను !***

పురందరే భార్య 1920లో తీవ్రంగా జబ్బుపడి, మంచమెక్కింది. శ్రీరామనవమి దగ్గరపడుతున్నందున, ఉరుసుకు తను పోగలనో లేదోనని మధనపడసాగింది. అప్పుడు బాబా ఆమెకు కలలో కన్పించి, "అమ్మా ! బాధపడకు ! నిన్నునేను ఉరుసుకు తప్పక తీసుకెళ్తాను" అని వాగ్దానం చేశారు, తమ వాగ్దానంమేరకు, ఆమెను శ్రీరామనవమి రోజున సద్గతి ప్రసాదించారు.

## బాబా పలుకులే బాధానివారణలు

***(224) రేపుదయం మహాలక్ష్మి దేవాలయం దగ్గరున్న నల్లకుక్కకు పెరుగన్నం పెట్టు, నీ బాధ నివారణమౌతుంది !***

బాలాగణపతిషింపే అనుభక్తుడు ఎన్నోరోజుల నుండి మలేరియా వ్యాధితో బాధపడేవాడు. ఏ వైద్యానికి అది లొంగలేదు. బాబాను దర్శించి, తన బాధను విన్నవించుకున్నాడు. బాబా పై విధంగా సెలవిచ్చారు. షింపే మరుసటి ఉదయం పెరుగన్నం తీసికొని, మహాలక్ష్మి దేవాలయానికి వెళ్లాడు.ఒక నల్లకుక్కతోకాడిస్తూ, అతని దగ్గర కొచ్చింది. దానికి పెరుగన్నం పెట్టాడు. అది తిన్నవెంటనే తన మలేరియా జ్వరం నివారణమైంది.

### *(225) నానా బాధను గోటితో తీసేశాను !*

ఒకసారి నానా సాహెబ్ చందోర్కరు పిరుదుపై మేహగడ్డ ఒకటి లేచి, విపరీతంగా బాధపెట్టింది. బాబాకు చెబితే, తన బాధను వారు స్వీకరించి, అనుభవిస్తారని, వారిని బాధపెట్టడం యిష్టంలేక తన బాధను తనే అనుభవించదలచాడు. డాక్టర్లు ఈ గడ్డను ఆపరేషక్ ద్వారా తొలగించాలని చెప్పారు. వారి సలహామేరకు, నానా ఆసుపత్రికెళ్లాడు. అప్పుడు ఆసుపత్రి ఒక పెంకుటింట్లో నడపబడుతూ ఉండేది.డాక్టర్లు నానాను ఆపరేషన్ టేబిలుపై బోర్లా పడుకోబెట్టి, ఆపరేషన్ సామగ్రి తెచ్చుకోడానికి వేరొక గదికి వెళ్లారు. నానా బోర్లాపడుకుని బాబానే ధ్యానిస్తూ ఉన్నాడు. అప్పుడొకపెంకు కప్పునుండి సరిగ్గా నానా పిరుదుపై నన్ను గడ్డపై పడింది. నానా బాధతో పెద్దగా అరిచాడు. గడ్డ చితికి, అందులో నున్న చీము, రక్తం అంతా బయటికి వచ్చేసింది. నొప్పికూడ తగ్గింది. డాక్టర్లు ఇది చూచి, ఆపరేషన్ అవసరంలేదని,గడ్డను తుడిచి, ఏదో మందురాసి, నానాను ఇంటికి పంపారు. తర్వాత రెండు రోజులకు గడ్డ మాని, నానా బాధ పూర్తిగా నివారణమైంది. ఇది జరిగిన కొద్దిరోజులకు,



నానా శిరిడీ వెళ్లి బాబాను దర్శించాడు.నానాను చూచి బాబా ఇతర భక్తులతో "నానా బాధను గోటితో తీసేశాను" అని ప్రకటించారు. అప్పుడు నానా పెంకుపడటం యాదృచ్ఛికం గాదని, అది బాబా కల్పించిన లీల అని తెలుసుకుని, వారికి కృతజ్ఞత లర్పించు కున్నాడు.

### *(226) ఎవరినుండైనా దక్షిణ స్వీకరిస్తే, వారి భారం నాదే కదా!*

గజానన్ నార్వేకర్ అను భక్తుడు తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ, తన కుమారునికి 500 రూ॥లు యిచ్చి, దానిని బాబాకు సమర్పించి రమ్మని శిరిడీ పంపాడు. బాబా లెండీ సమీపంలో భక్తులతో ఉన్నప్పుడు, గజానన్ కుమారుడు తన తండ్రి పంపిన 500రూ॥లు బాబాకు సమర్పించాడు. బాబా పైకం స్వీకరించిన వెంటనే తమ శరీరం వణికి, కాస్త తూలినట్లయింది. భక్తులు ఇది గమనించి, "బాబా ! ఏమి జరిగింది?" అని ఆతృతగా అడిగారు. బాబా, "ఎవరి నుండైనా దక్షిణ స్వీకరిస్తే వారి భారం నాదేకదా అన్నారు. గజానన్ జ్వరం బాబా స్వీకరించారని భక్తులకర్థమైంది.ఇక్కడ బాబా దక్షిణ స్వీకరించిన మరుక్షణమే అక్కడ గజానన్ స్వస్థతపొందాడు. దీనిని బట్టి బాబా ఎవరి నుండైనా, దక్షిణ స్వీకరిస్తే వారి బరువు, బాధ్యతలను తమపై వేసుకుంటారని మనకు అర్థమౌతుంది.

### *(227) నేను పాతికేళ్లనుండి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ ఉండేవాడిని. అదేమి చిత్రమో అది ఈ క్షణం నుండి మటుమాయమయ్యింది*

25సం॥ల నుండి తీవ్రమైన తల నొప్పితో బాధపడుతున్న భక్తుడొకడు శిరిడీ వచ్చి, బాబాను దర్శించి, వారి సన్నిధిలో కూచున్నాడు. అప్పుడు బాబా అక్కడున్న భక్తులతో పై మాటలన్నారు. బాబా నోటి నుండి పైమాటలు వెలువడిన మరుక్షణమే ఆ భక్తుని తలనొప్పిమటుమాయమయ్యింది. ఇది బాబా అనుగ్రహంగా భక్తుడు భావించి, వారికి మనస్సులోనే కృతజ్ఞత లర్పించుకున్నాడు. కానీ అక్కడున్న మిగతా భక్తులెవ్వరికి, బాబా అలా ఎందుకన్నారో అర్థంకాలేదు. మునుపెన్నడూ వారు తలనొప్పితో బాధపడుతున్నట్లు చెప్పిఎరుగరు. తలనొప్పితో బాధపడిన భక్తుడు తర్వాత ఇతర భక్తులతో తన అనుభావాన్ని గూర్చి చెప్పాడు. అప్పుడు కానీ, బాబా ఈ భక్తునితో తాదాత్మ్యం చెంది పైమాటలన్నారని తెలిసిరాలేదు.

***(228) శ్యామా, నా కళ్లు నన్ను విపరీతంగా బాధిస్తున్నాయి !***

పండరీపురం సబ్ జడ్జిగా పనిచేస్తున్న తాత్యాసాహెబ్ నూల్కర్ ఏదో తెలియని కళ్లజబ్బుతో బాధపడేవాడు. ఎన్ని వైద్యచికిత్సలు చేసినా అది లొంగలేదు. అతను కోర్టుకు శలవుపెట్టి,బాబా దర్శనానికై శిరిడీ వచ్చాడు. అతను తొలుత మశీదుకు వచ్చి, బాబాకు నమస్కరించి, వారిముందు కూచున్నాడు,బాబా తమ ప్రక్కనే ఉన్న శ్యామాతో, “శ్యామా! నా కళ్లు నన్ను విపరీతంగా బాధిస్తున్నాయి”.అన్నారు. మరుక్షణం తాత్యా కళ్ల బాధ నివారణమైంది.

***(229) 24గంటలలో మానిపోతుందని ఎందుకుచెప్పావ్? వెంటనే అని చెప్పలేకపోయావా?***

1934లో నాచ్నే మూడు సంవత్సరాల బిడ్డకు న్యుమోనియా వచ్చింది. అది కాస్త తగ్గిన తర్వాత తట్లువచ్చి, ఛాతీ భాగమంతావ్రణాలు లేచాయి. బిడ్డ కృశించి పోసాగాడు. డాక్టర్లు ఆ వ్రణాలను ఆపరేషన్ చేసి, తొలగించాలని ప్రయత్నించి బిడ్డ బలహీనంగా ఉన్నందువల్ల భయపడి మానుకున్నారు.నాచ్నే బాబాను స్మరించి ఏదో ఆయింట్‌మెంట్ పూశాడు. కాసేపటికి,వ్రణాలన్నీ విచ్చుకున్నాయి. తర్వాత బాబాను ప్రార్థించి, విచ్చుకున్న వ్రణాలపై ఊదీచల్లాడు. ఈ విషయం వాళ్ల డిప్యూటీ కలెక్టరుకు తెలిసి ఆశ్చర్యపోయాడు.“ఏమిటి నీపిచ్చి? ఊదీవలన వ్రణాలు మానిపోతాయనే అనుకుంటున్నావా? “అని నాచ్నే నడిగాడు, తప్పక మానిపోతాయని నాచ్నే చెప్పాడు, “ఎంతసమయంలో”? అనడిగాడు, డిప్యూటీ కలెక్టరు.24గం॥లలోనని నాచ్నే సమాధానమిచ్చాడు.ఆరోజు రాత్రి బాబా కలలో కన్పించి, “24 గంటలని ఎందుకు చెప్పావ్? వెంటనే అని చెప్పలేకపోయావా? అని అన్నారు. బాబా తనపై చూపిన కృపకు నాచ్నే కృతజ్ఞత లర్పించుకున్నాడు. నాచ్నే చెప్పినట్లు, 24గం॥లలో వ్రణాలు మానడం చూచి డిప్యూటీ కలెక్టరు ఆశ్చర్యపోయాడు. అతనికి బాబా పై అపారమైన నమ్మకం ఏర్పడింది. (ఇంకా ఉంది)

ఓం గణేశాయ నమః

# అష్టగణపతి క్షేత్రములు

*(గత సంచిక తరువాయి భాగము)*

## 5. శ్రీచింతామణి - థేవూర్



వైశంపాయన మహర్షి ఉపదేశాను సారము, రాజు అభిజిత్, రాణి గుణవతి చాలా సంవత్సరములు తపస్సుచేసి, ఒక పుత్రుని పొందిరి. అతడు పెద్దవాడై గణరాజు అను పేరుతో ప్రసిద్ధి చెందెను. ఒకనాడు గణరాజు తన సైన్యముతో వేటకై వెళ్లి చాల అలసి, విశ్రాంతి తీసుకొనుటకై కపిలమహర్షి ఆశ్రమమునకు వెళ్ళెను. కపిలమహర్షి ఆ రాజును ఆదరించి సైన్యముతో సహా వారందరకు చాలా గొప్ప విందు చేసెను. రాజు కపిలమహర్షిని ఇది ఎట్లు సాధ్యమైనదని ప్రశ్నింపగా, తన వద్ద చింతామణి అను మణి ఉన్నదనియు, అది తనకు ఇంద్రునిచే ఇవ్వబడినదనియు, ఈ విందు ఆ మణి ప్రభావమేననియు చెప్పెను. అప్పుడు గణరాజు ఆ మణిని తనకిమ్మని కపిలమహర్షిని కోరెను. కపిలమహర్షి ఒప్పుకొనలేదు. అందుచే కోపించి, గణరాజు కపిలమహర్షి నుండి ఆ మణిని బలాత్కారముగా తీసుకొనివెళ్లెను. కపిల మహర్షి చింతితుడై, దుర్గాదేవిని ప్రార్థించెను. అప్పుడు దుర్గాదేవి కపిలమునికి విఘ్నేశ్వరుని ప్రార్థింపుమని ఆనతిచ్చెను. అతడు ఆ ప్రకారము చేయగా విఘ్నేశ్వరుడు ప్రత్యక్షమై, గణరాజుతో



భయంకర యుద్ధము చేసెను. చివరకు విఘ్నేశ్వరుడు తన గొడ్డలితో గణరాజును చంపి, ఆ మణిని తిరిగి కపిలమహర్షికి అందజేసెను. యుద్ధము ఒక కబంధవృక్షము వద్ద జరిగినది. అందుచే ఈ థేవూర్ గ్రామమునకు కబంధతీర్థమని పేరు వచ్చినది. చింతామణి అను మణి తనకు తిరిగి లభించుటచే కపిలమహర్షి చాల సంతసించెను. కాని కపిలమహర్షి ఆ చింతామణిని మరల విఘ్నేశ్వరునకే యిచ్చి, అతని పూజచేసెను. అప్పటినుండి కపిలమహర్షి కోరికపై విఘ్నేశ్వరుడు ఈ క్షేత్రమునందున్నవాడై, "చింతామణి వినాయకు"డని పిలువబడుచుండెను. ఈ విధముగా థేవూర్ "చింతామణి గణపతి" పుణ్యక్షేత్రమైనది.

**గమనిక :** థేవూర్ గ్రామము పూణే జిల్లాలో, హవేలి తాలుకాలో పూణేనుండి 25 కిలోమీటర్ల దూరములో ఉన్నది.

# శ్రీలలితా సహస్రనామములు(అర్థసహితము)

(గతసంచిక తరువాత భాగం) – ***యఅమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్

**87.“ఓం శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణ్యైనమః” :** కటినుండి అధభాగము “శక్తికూటమి”గా చెప్పారు. “సకల హ్రీం” 4 బీజాక్షరముల, మహామంత్రస్వరూపం. శ్రీజగన్మాతృక ఆపాదమస్తకం మూడు కూటముల ద్వారా గోప్యంగా తెలిపి ఈ షోడశాక్షరీవిద్య శ్రీవిద్యను “శ్రీ” అను బీజాక్షరంతో చేర్చి జపించాలి. గురూపదేశం పొంది నియమ నిష్ఠతో జపిస్తే ఈ మూడు మంత్ర ప్రభావం “శ్రీమంత్ర స్వరూపిణి”గా మనసులో సాక్షాత్కరించును. శ్రీవిద్యాస్వరూపిణికి శిరసానమామి.



**88. “ఓం మూలమంత్రాత్మకాయై నమః” :** శ్రీమాత పంచదశాక్షరీ మూల మంత్ర స్వరూపిణికి శిరసా నమామి.

**89. “ఓం మూలకూటత్రయ కళేబరాయై నమః” :** కుండలిని అను సూక్ష్మతరరూప వర్ణన చెప్పారు. ఇది పిండాంతర్గత సూక్ష్మ తమ వర్ణన. “కులం” అనగా షట్చక్రములందు వివిధ రూపనామములతో విహరించు దేవతా స్వరూపిణి “సర్వాకర్షిణి, సర్వవశంకరి” అని స్తుతించింది దేవీ ఖడ్గమాల. శ్రీవిద్య (శాంభవీ విద్య) చాలా పవిత్రమైన పరమలోకము చేర్చును. శ్రీమంత్రాత్మికకు నమస్కారం.



**90. “ఓం కులసంకేతపాలిన్యై నమః”:** మనలోని సుషుమ్నా నాడి యొక్క మార్గాన్ని సహస్రారకమలం వరకు చేరి సుధామృతము గ్రోలు కుండలినీ యోగమును కులవిద్య, కాలవిద్య యోగవిద్య అంటారు. “కుల” అనగా కులపథం, కులమార్గం, శ్రీకుండలిని యోగవిద్యను రహస్యముగా, గోప్యంగా వుంచి దీని సంకేతములను రక్షించి, జ్ఞానులకు మాత్రమే బోధించును.

**91. “ఓం కులాంగనాయై నమః”:** శ్రీకుండలినీ శక్తిస్వరూపిణి శ్రీమాత కులస్త్రీవలె గుప్తముగా వుండును. శ్రీవిద్య పరమపవిత్రమైనది. శ్రీపరమపావనికి నమస్కారం.

**92. “ఓం కులాంతస్థాయై నమః”:** శ్రీమాత కుండలినీ యోగంలో యోగసాధనలో షట్చక్రములు దాటి, సహస్రారకమలంలో ప్రవేశించగలిగితేనే అచట దర్శనం పొందగలం. అనగా పూజ, జప, తప, ఆరాధన, అర్చన ఇలా అన్ని బాహ్యపూజలు చేసినా భక్తి నియమముతో అంతరపూజ చేసి తరించాలి. శ్రీఅంతరంగ శ్రీరంగనాయకినికి ఆత్మార్పణ జేతు. శ్రీలోకాతీత శ్రీలలితా పరమేశ్వరికి శిరసానమామి.

**93. “ఓం కౌళిన్యై నమః”:** కుండలినీ యోగరూపిణిని “కౌళిని” అంటారు. వారి వారి ఇష్టదైవమును, కులాచారమునుసరించి పూజింతురు. “కుల” అనగా మూలాధారం, “అకులము” అనగా సహస్రారం. కులరూపిని శ్రీమాత “అకుల” అనగా శివుడు. కాళినీ ఆరాధన కుండలినీ యోగసాధనయే. పరమ యోగులు, భక్తులు ఈ యోగసాధన జేసి తరింతురు. శ్రీకులయోగినికి నమస్కారం. (సశేషం)

# సర్వవ్యాధులకు దివ్యౌషధం శ్రీధన్వంతరీ మూలమంత్రం

***ఓం నమో భగవతే వాసుదేవాయ ధన్వంతరయే అమృత కలశహస్తాయ।***
***సర్వ అమయ వినాశనాయ త్రైలోక్యనాధాయ శ్రీమహావిష్ణవే నమః ॥***

తా॥ అమృత కలశాన్ని కరమున ధరించిన వాసుదేవా ! ధన్వంతరీ మహానుభావా!, సర్వరోగ నివారకా! ముల్లోకాలకు నాథుడవు, శ్రీమహావిష్ణు దేవుడవూ అయిన నీకు నమస్కృతులు

### శరణాగతి

శరణు + ఆగత = శరణాగత – తనకు రక్షణ కోరి అర్థించడం, సర్వులకు దైవమే రక్ష. సర్వస్వాన్నీ భగవంతునికి అర్పించి తనకు సుఖంగానీ, దుఃఖంగానీ ఏది సంభవించినా అది తన కర్మఫలం నుంచే వస్తుందని విశ్వసించి, ఆయనపైనే ఆధారపడి ఉండటాన్ని "శరణాగతి" అంటారు.

- జీవితమనేది ఎప్పుడూ ఒక పూలపాన్పులాగ సుఖంగా ఉండదు. సుఖ దుఃఖాలనేవి ఒక నాణేనికి రెండువైపులా ఉండే బొమ్మ బొరుసులాంటివి. మనిషి ఆ సుఖదుఃఖాలను జీర్ణించుకునేందుకు తగిన మానసిక శక్తిని పెంపొందించు కోవాలి.

- కోపం, దుఃఖం, ద్వేషం, అసూయ, అహంకారం, భయం, ఆత్మాన్యూనతా భావం మొదలైన అవరోధాలు మనిషిని బలహీనుడిగా చేసి అతడి ఆత్మ విశ్వాసాన్ని పోగొడతాయి.

- ఈ శరీరం మన ఆస్తికాదు. మనం దాని బాగోగులు చూడవలసిన వాళ్లం మాత్రమే.

- ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. కొద్దిగా ఓరిమి, ఆత్మ విశ్వాసం కావాలి. జీవితంలో సమస్యలను ఎదుర్కొనేందుకు కావలసిన మానసిక బలం, ధైర్యం మనం పెంపొందించుకుంటే అవి మటుమాయమైపోతాయి. □



# ఆధ్యాత్మిక సంపద

- భగవంతుడు అందరిలోను ఉన్నాడు. అందరి ద్వారాను పనిచేస్తున్నాడు. భగవంతుని ఉనికి, యిచ్చ పరిశుద్ధమైన మనస్సుగలవారిలో ఎక్కువగా చూడవచ్చు. సాధారణ మనుష్యులకంటె పవిత్ర హృదయంగల వారిలో భగవంతుని కార్యకలాపాలను స్పష్టంగా చూడవచ్చు. అందుచేత మనుష్యులు వీరిని "అధికార పురుషులు" అని పిలుస్తారు. అధికారిక పురుషులు తాము భగవంతునకు మధ్యవర్తులం అని చెప్పరు. అట్లావారు చెబితే వారికింకా అహంకారము మిగిలివున్నట్లే. అది పూర్తిగా భగవంతునకు శరణాగతి చెందినట్లే.
- సోమరితనము, అజ్ఞానము మనలను తినివేయు చీడపురుగులు. తన స్వార్థము కొరకు మాత్రమే ప్రయత్నించు వ్యక్తి పతనము పొందకతప్పదు. నిరంతర సేవా పరాయణులగువారికి పతనము పొందు అవకాశము లేదు. (మహాత్మా గాంధి)
- జబ్బుపడుట మానవునకు సిగ్గుచేటు కావలెను. మన మనస్సు, మన శరీరము మన వశమునందున్నప్పుడు జబ్బుపడవలసిన ఆగత్యమే యుండదు. దుష్టభావములు కలుగుట కూడా రోగమునకు చిహ్నమే. కాబట్టి దుష్టభావములు కలుగకుండా చూసుకొనవలెను. ఈ దుష్టభావములు నుండి వికారములనుండి రక్షించుకొనుటకు అమోఘ ఉపాయము సాయినామమే. కాని ఈ సాయి నామము కేవలము నోటినుండి గాక హృదయమునుండి వెలువడవలెను.
- ఏ పనిచేసిననూ ఒక ఫలితము కొఱకే. ఫలాపేక్షరహితమనగా ఫలితమును నిర్లక్ష్యము చేయుటకాదు. ఏ పని చేసినను అది సక్రమమైన ఫలితము కలుగునటుల శ్రద్ధతో చేయవలెను. ఫలితము మాత్రము దైవార్పణ చేసి, తదుపరి, ఫలితములను గూర్చిన నిరాశ, అసంతృప్తి వంటి బాధలు కలుగవు. అంతా భగవదేచ్ఛ అనే అవగాహన మనస్సులో స్థిరముగా ఏర్పడిన అప్పుడు ఎంతో ఆనందదాయకమైన ప్రశాంతత సమకూరును. అప్పుడు మనము చేయు ప్రతికార్యము దేవతార్చన అగును. రోజు చేయుపనులే కాని ఫలాపేక్ష త్యజించిన, పని పూజగా మారి జీవితమునే శోభాయమానము చేయును.
- ఎవ్వడు ఫలాపేక్ష రహితముగా కర్మల నాచరించునో అట్టివానికి తామరాకు ను నీరు అంటని విధముగా పాపము అంటదు.

□

# శీలసంపద

చి॥గరిమెళ్ళ కళ్యాణరామస్వరూప్, గూడురు

మానవుడు ఎంత విద్యావంతుడైనా, ఎంత బుద్ధిమంతుడైనా, ఎంత ధనవంతుడైనా మంచిశీలము లేనిదే అతనికి గౌరవం ఉండదు.

ఇంతకీ శీలమంటే ఏమిటి?

'శీల'మంటే మంచి స్వభావము / మంచి ప్రవర్తన అని చెప్పవచ్చు. శీలవంతుడు జీవితములో ఎంతో గొప్పస్థాయికి ఎదుగుతాడు. శీలమును కోల్పోయినవాడు తన సర్వస్వాన్ని కోల్పోతాడు. అందుకు ఉదాహరణగా ఒక కథను తెలుసుకుందాం !

మనందరికి తెలుసు ప్రహ్లాదుడు. రాక్షసకులములో జన్మించిన అతడు గొప్ప విష్ణుభక్తుడు. ఎంతో భూతదయ గలవాడు. విద్యలయొక్క పరమార్థము తెలిసినవాడు.

తండ్రియైన హిరణ్యకశిపుని మరణానంతరం ఎంతోకాలం రాజ్యపాలన చేశాడు. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించాడు. వేదాలలో చెప్పినట్లుగా ఎన్నో యజ్ఞయాగాదులను చెశాడు. దానధర్మాదులను చేశాడు. తన పుణ్యకర్మల ఫలంతో దేవేంద్రపదవిని కూడా పొందాడు. స్వర్గలోకానికి అధిపతియైనాడు. ఆ కారణంగా మహేంద్రుని పదవి పోయింది.

మహేంద్రుడు విచారముతో గురువైన బృహస్పతి వద్దకు వెళ్ళాడు. తన పదవి పోయిన విషయాన్ని తెలిపి, మరల తాను ఇంద్రపదవిని పొందే



ఉపాయం చెప్పమని కోరాడు.

బృహస్పతి మహేంద్రునితో "ఓ ఇంద్రా ! ప్రహ్లాదుడు బాల్యమునుండి భగవద్భక్తి, ధ్యాననిష్ఠా, జీవకారుణ్యమువంటి ఎన్నో సద్గుణములు కలవాడు. చక్కని శీలసంపద కలవాడు. అతడు తన ఉత్తమ వ్యక్తిత్వముతో, ఎన్నో సత్కర్మలను చేశాడు. అందుకే ఎంతో గొప్పదైన దేవంద్రపదవిని పొందగలిగాడు. అతనిలో ఉత్తమ లక్షణాలున్నంతవరకు నీకు మరల ఇంద్రపదవి లభించదు. ప్రహ్లాదుడు దానశీలి. గనుక అతడు దానం చేసే సమయంలో మారువేషములో వెళ్లి అతని శీలాన్ని దానంగా కోరుము" అని చెప్పాడు.

దేవగురువు చెప్పిన విధంగా మహేంద్రుడు భిక్షురూపంలో ప్రహ్లాదుని వద్దకు వెళ్లి అతని శీలాన్ని దానంగా ఇవ్వమని కోరాడు. ప్రహ్లాదుడు ఆశ్చర్యపోయాడు. "ఓయీ ! ధన - కనక - వస్తు - వాహనాదులను కోరకుండా నా శీలాన్ని అడుగుతున్నావేంటి? దానితో నీకేం ప్రయోజనం" అన్నాడు ప్రహ్లాదుడు. "ఓ రాజా ! మన్నించు ! నాకదొక్కటి చాలు మరేదీ వద్దు" అన్నాడు యాచకుడు. యాచకుని వింతకోరికను మన్నించి ప్రహ్లాదుడు "అయితే నా శీలాన్ని ఇప్పుడే దానం చేస్తున్నాను, తీసుకో" అన్నాడు ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుడు అలా అన్నాడో లేదో, ఇంతలో ఒక దివ్యతేజస్సు ప్రహ్లాదుని శరీరంనుండి బయటకు వచ్చి ఆ యాచకునిరూపంలో ఉన్న ఇంద్రునిలో ప్రవేశించబోతుంది. ప్రహ్లాదుడు ఆ తేజస్విని చూసి "ఎవరు నువ్వు?" అని ప్రశ్నించాడు. "ప్రభూ ! నేను నీ శీలాన్ని. నీవు నన్ను ఈ యాచకునికి దానం చేశావు కదా ! అందుకే నిన్ను వదలి నేను ఇతనిలో ప్రవేశిస్తున్నాను" అని బదులిచ్చి అతనిలో ప్రవేశించింది.

మరికొంతసేపటికి మరో దివ్యతేజస్సు ప్రహ్లాదుని శరీరంనుండి బయటకు వచ్చింది. ప్రహ్లాదుడు దానిని "నీ వెవరవు?" అని ప్రశ్నించాడు. "ప్రభూ ! నేను నీలోని శౌర్యాన్ని, నీలోని శీలానికి నేను సేవకుడిని.నా ప్రభువు నీలో ఉన్నంతకాలం నేను కూడా నీలో ఉండి సేవచేసాను. నా ప్రభువు నన్ను విడిచినందున నేను కూడా అతనిని అనుసరిస్తున్నాను." అంటూ ఆ బిక్షకుని రూపంలో ఉన్న ఇంద్రునిలో ప్రవేశించింది.

చివరకు ఒక అందమైన స్త్రీ ఆకారంలో మరో దివ్యకాంతి ప్రహ్లాదుని శరీరంనుంచి బయటకు వచ్చింది. ప్రహ్లాదుడు ఆమెను "నీ వెవరవు? ఎందుకు నన్ను విడిచి వెళుతున్నావు?" అని అడిగాడు.

ఆ కాంతికాంత "ఓ రాజా ! నేను నీ రాజ్యలక్ష్మిని. నేను కూడా శీలమునకు సేవకురాలను. కాబట్టి శీలంతోపాటే నేను కూడా వెళ్ళిపోతున్నాను" అంటూ ఆ యాచకునిలో ప్రవేశించింది.

ఆ విధంగా ప్రహ్లాదుడు తన 'శీలసంపద'ను దానం చేయటంతో తన శౌర్యాన్ని, రాజ్యలక్ష్మిని కూడా కోల్పోయాడు.

కాబట్టి మనిషికి ధనంకంటే, విద్యకంటే, బుద్ధికంటే, ధర్మంకంటే, శౌర్యంకంటే శీలమే గొప్పది. అందుకే మన పెద్దలు

శ్లో॥ విదేశేషు ధనం విద్యా, వ్యసనేషు ధనం మతిః ।
పరలోకే ధనం ధర్మః, శృలం సర్వత్ర వై ధనమ్ ॥ అన్నారు.

"శీలము" మనం ఎక్కడికి వెళ్ళినా మనకు తరగని ధనంగా మనలను ఆదుకుంటుంది. అన్నివేళలా అన్ని విషయములలో మనకు ఉపయోగపడుతుంది.



# పరులకు కీడు చేయు కొండెములు చెప్పకు

జి.వి.యస్. సుబ్రహ్మణ్యశర్మ

మానవులు పరుషముగా పలుకరాదు. ఇంకొకరి మనస్సునకు బాధ కలిగించునట్లుగా చాడీలను చెప్పకూడదు. వీనిని చెప్పుటవలన ఎదుటవారికి బాధ కల్గును. దానిని చూసి తిరిగి ఆ బాధ మననీ చేరవచ్చును. కాని కొందరికి చాడీలను చెప్పనిచో కడుపు ఉబ్బిపోవును. వానిని చెప్పక వారు వుండలేరు. ఇది వారి సహజ గుణము. ఈ గుణము తగదని చెప్పుటకే రాహుకేతువుల ఈ దిగువ సామెత ఉదాహరణ. అమృతమునకై క్షీరసాగర మధనము జరిగినది. అమృతము లభించినది. దానిని పంచుకొను విషయములో వివాదమేర్పడినది. ఆ తగువును తీర్చుటకు శ్రీమహావిష్ణువు జగన్మోహినీ అవతారము నెత్తినాడు. దేవతలను ఒక వైపు, రాక్షసులను ఒక వైపు కూర్చునబెట్టి జగన్మోహిని అమృతమును దేవతల వైపునుండి పంచుట ప్రారంభించినది. రాక్షసుల వరుసలో రాహువు అనువాడు కూర్చొని, తమ వరకు అమృతము రాదేమో అను అనుమానంతో రాక్షసరూపమును విడిచి, దేవతారూపమును ధరించి దేవతల వరుసలో కూర్చొని ఉన్న సూర్యచంద్రుల మధ్యకు చేరినాడు. సూర్యచంద్రులు ఆ కొత్తవాని రాకను గూర్చి జగన్మోహినికి చాడీ చెప్పినారు. జగన్మోహిని వాని తలను తన చక్రముతో నరికివేసినది. అప్పటికే అమృతము వానిగొంతునుండి పొట్టలోనికి దిగుటవలన రాహువు శరీరము రెండు ముక్కలు అయినను తల, మొండెము అను రెండు రూపములతో బ్రతికియే ఉన్నది. ఆ రెండు రూపములలో మొండెము రాహువుగాను, తల కేతువుగాను మారి రెండు గ్రహములు అయినది. ఆ రాహుకేతువులే తమపై జగన్మోహినికి కొండెము (చాడీ) చెప్పినందువలన గ్రహణసమయములందు సూర్యచంద్రులను పట్టి పీడింపసాగినవి. కొండెములు చెప్పుటవలన ఎట్టి దుస్థితి సూర్యచంద్రులకు కలిగినదీ గమనించి మనము అందరము జాగ్రత్తగా వుండవలెను.

**ఇందు గ్రహింపవలసిన నీతులు**

1. చాడీలు చెప్పుట నేరము. ఆ నేరమునకు శిక్ష అనుభవించవలెను.
2. తమకు సంబంధము లేని పనులలో సూర్యచంద్రులవలె తల దూర్చి ఆపదలను కొనితెచ్చుకొనరాదు.
3. ఎంతటి వారికైనను చేసిన తప్పు అనుభవించక తప్పదు.

# సత్సంగ మహిమ

సేకరణ : **కె.ఆర్.విజయ్‌కుమార్,** మదనపల్లి - 517325

సత్సంగం ద్వారా మహత్తరమైన కార్యమును సాధించవచ్చు. పుణ్యపురుషులైన భాగ్యశాలులకు మాత్రమే అది లభిస్తుంది. సత్సంగం రెండు రకాలు. 1. మహాత్ముల శరీర సాంగత్యం 2. మహాత్ముల ఉపదేశ సాంగత్యం. ఈ రెండింటిలో మొదటిది మహాత్ముల శరీరసాంగత్యం అనగా గురుసేవ చేసే అదృష్టం లభించడం చాలా దుర్లభం. ఏలన నిజమైన సాధువులను మహాత్ములను గుర్తించడం కష్టం. అనేకసార్లు వారి బయటి వేషభూషణలను చూసి మోసపోయే సంభవముంది. ఒకవేళ దొంగ సాధువు యొక్క సహవాసం లభిస్తే దానివల్ల మనకు హాని కలుగుతుంది. రెండవ మార్గం మహాత్ముల ఉపదేశానుసారం నడచుకొనడం. ఇందులో మోసం లేదు. ఎందుకనగా ఏ సాధువేకాని సన్మార్గమే బోధింప వలసి యుండును. సాధకుడు శ్రద్ధగా సాధనచేసి సత్సంగ లాభమును పొందవచ్చు. నిజమైన మహాత్ముల సహవాసం లభిస్తే జన్మసార్థక మవుతుంది.

**సాధులక్షణమేమి?** ఒక్కమాటలో చెప్పాలంటే సర్వత్రా భగవంతుణ్ణి దర్శించినవాడే సాధువు. మనం కూడ సాధువులైతే సులభంగా సాధువులను గుర్తించవచ్చు.

**సాధకుడెవడు?** తన చురుకు బుద్ధి నుపయోగించకుండా సంతులు చూపిన మార్గంలో నడుచువాడే నిజమైన సాధకుడు. ఎవరి సృష్టి అంతయూ పరమాత్మ రూపంగా తోచునో, మరి తన శిష్యుని యందునూ ఎవరు పరమాత్మ రూపాన్నే చూడగలడో అతడే నిజమైన గురువు. సద్గురువు ఎన్నటికీ సన్మార్గము నతిక్రమింపడు. అతనికి మరణభీతి ఉండదు. తమ శిష్యులు ఆధ్యాత్మిక మార్గంలో ఏ అంతస్తులో ఉన్నారో గురువుకు తెలుసు. అయితే సాధకులు మాత్రం గురువును పరీక్షచేయుటకు పూనుకోరాదు. మనకు భగవద్దర్శనం చేయవలెనను తీవ్ర ఇచ్ఛ ఉంటే చాలు, మహాత్ములే మనలను వెతుక్కుంటూ వస్తారు. మహాత్ములు మన మధ్యలోనే ఉన్నా, మనం వారిని గుర్తింపజాలం. సాధకుని మనఃస్థితిని గుర్తించే



యోగ్యత వారికుంటుంది. సత్సంగము లభించిన తరువాతనూ దాన్ని సంరక్షించుకోవటం కష్టసాధ్యమే. ఏలన మన మనస్సు విషయాల్లో లీనమై యుండుటవల్ల మహాత్ముల ఉపదేశప్రభావం మన మనస్సుపై పరిణామం కాదు.

సాధుపురుషులు సంచరించే, మాట్లాడే దేవతలు, మహాత్ములు దేహరోగ నివారణలు కాదు. భవరోగ వినాశకులు. భగవన్నామమును సిద్ధపరచి యివ్వడమే, మహాత్ములు జగత్తుకు చేసే మహోపకారం. వారి హితోపదేశములు వేద మరియు ధర్మసమ్మతంగా ఉంటాయి. మహాత్ములు సూర్యునివలె జగత్తునకు స్వాభావికంగా ఉపకారం చేస్తూంటారు. మానవజన్మ ధరించి వచ్చిన మనం సుఖదుఃఖములు అనుభవిస్తూ వుంటే మనపై కృపావర్షమును కురిపిస్తారు. మనుష్యజన్మ లభించియూ భగవత్ప్రాప్తి లభించకపోతే జన్మ వ్యర్థమే !

(బ్రహ్మీభూత సద్గురు శ్రీశ్రీశ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వాములవారు)

## దానమహిమ

1. ధనమునకు దానము, భోగము, నాశము అనే మూడు గతులు కలవు.
2. 'శతహస్త సమాహార । సహస్ర హస్త సంకిర' నూరు చేతులతో సంపాదించండి. వేయి చేతులతో దానము చేయండి.
3. దానము గ్రహీత అడిగిన వెంటనే తన వద్ద ఉన్న వస్తువును యిచ్చివేయాలి. వాయిదా వేయకూడదు.
4. విధి అనుకూలముగా వున్నప్పుడే ఆలస్యం చేయకుండా దానము చేయాలి. భగవంతుడు దాన్ని మళ్లీ భర్తీ చేస్తాడు. ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా దానము చేయాలి. భగవంతుడు కృపావర్షము కురిపిస్తాడు.
5. "దాతావ్యమితి యద్దానం... తద్దానం సాత్త్వికం స్మృతమ్" (గీత) దానము చేయడం మన కర్తవ్యమని భావించుకోవాలి. ప్రతిఫలాపేక్ష ఉండకూడదు. దేశకాలాదులను సత్పాత్రతను గమనించి దానము చేయాలి. నిజమైన సాధుసత్పురుషుల కిచ్చేదానము సర్వశ్రేష్ఠమనబడుతోంది.

(- ధర్మగ్రంథాలనుండి)

# షోడశోపచార పూజ అంతరార్థం

**షోడశోపచారపూజ :-** షోడశ అనగా 16. పదహారు అనేది పూర్ణసంఖ్య. చంద్రుడు పూర్తిగా ప్రకాశిస్తున్నప్పుడు 16 కళలు కల్గివుంటాడు. శుక్లపాడ్యమి నుండి బహుళపాడ్యమి వరకు 16 రోజులలో చంద్రుడు వృద్ధిచెందుతాడు. అందుచేత దేవునికి కూడా మనం 16 ఉపచారాలతో కూడిన పూజ చేస్తాము. 16 ఉపచారములు 1. అవాహనం 2. ఆసనం 3. పాద్యం 4. అర్ఘ్యం 5. ఆచమనం 6. స్నానం 7. వస్త్రం 8. ఉపవీతం 9. గంధం 10. పుష్పం 11. ధూపం 12. దీపం 13. నైవేద్యం 14. తాంబూలం 15. ప్రదక్షణం 16. విసర్జనం. వీటిలో పదవది అయిన పుష్పం అనేచోట అష్టోత్తర లేక సహస్రనామపూజ చేస్తాము. 14వది అయిన తాంబూలం సమర్పించిన తరువాత ప్రదక్షణ చేస్తాము.

దైవం అనేది "శక్తి". దానిని ఒక విగ్రహంలోనికి ఆహ్వానించి పూజిస్తాము. ఒక అతిథి మన ఇంటికి వస్తే ఉపచారాలు చేసి ఎలా మర్యాద చేస్తామో దేవుణ్ణి కూడా మనవలె ఒక రూపం ధరించిన వ్యక్తిగా ఊహించుకొని అర్చిస్తాము. మొదట ఒక రూపంలోనికి దేవతాశక్తిని అవాహన చేస్తాము. ఉదాహరణకు పాలను సీసాలో పోస్తే సీసారూపం, కప్పులో పోస్తే కప్పురూపం పొందినట్లు ఏ రూపము లేని దైవశక్తిని శివునిలోనికో, హనుమంతుని విగ్రహంలోనికో, సత్యనారాయణ స్వామి విగ్రహము లోనికో ఆహ్వానిస్తే, దైవశక్తి ఆ విగ్రహరూపం దాలుస్తుంది. కనుక మొదట అవాహన చేస్తాము. అంటే ఆ దేవతాశక్తిని ఒకచోట స్థిరపరచడమన్నమాట. ఆ పదహారు ఉపచారాల అంతరార్థం యిదే.



దేవతామూర్తి రూపాన్ని మూడు విధాలుగాను శుభ్రపరుస్తాము. పాదము నుండి శిరస్సు వరకు నీటితో స్పృశిస్తాము. మొదట 'పాద్యం' అంటే పాదాలను కడగటం, రెండవది 'అర్ఘ్యం' చేతులను శుభ్రపరచటం, మూడవది 'ఆచమనం' అంటే ముఖాన్ని నీటితో తాకడం. ఇలా శరీరంలోని అధోభాగం, మధ్యభాగం, ఊర్ధ్వభాగములకు ఉదకములతో ఉపచారాలు చేస్తాము. ఇందువల్ల శక్తి శాంతము చెందుతుంది. తరువాత స్నానం నీటిలో ప్రాణశక్తి ఉంది. నీటిలో ప్రాణవాయువు ఉందని సైన్సు చెప్తుంది. అందుచేత విగ్రహానికి ప్రాణం పోస్తున్నట్లు, ప్రాణశక్తిని ప్రతిష్ఠిస్తున్నట్లు ఊర్ధ్వభాగం నుండి అధోభాగానికి నీటితో అభిషేకం చేస్తాము. ఒక రుద్రుడికే గాక అందరూ దేవతామూర్తులకూ అభిషేకం చేయవచ్చు. రుద్రుడు గనుక శివుని రౌద్రం శాంతించడం కొరకు నీటితో అత్యధికంగా అభిషేకం చేస్తాము. ఆ తరువాత స్నానానంతరం వస్త్రం సమర్పిస్తాము. అది శరీరం అధోభాగానికి! ఉత్తరీయం ఊర్ధ్వభాగానికి సమర్పిస్తాము. ఉపవీతాన్ని యజ్ఞోపవీతము వలె ధరింపచేయాలి. ఆ తరువాత శరీరానికి సమశీతోష్ణస్థితిని కలిగించే గంధాన్ని సమర్పిస్తాము. ఆ తరువాత పుష్పాలు సమర్పిస్తూ అష్టోత్తర శతనామాలతోనో, సహస్రనామాలతోనే దేవతామూర్తి గణగుణాలను వర్ణిస్తూ పూజిస్తాము. పూజ అక్షతలతోగాక పూలతోనే చేయాలి. నా హృదయం పుష్పంలాగ వికసిస్తున్నది. నా హృదయాన్ని ఈ పుష్పాలరూపంలో నీకు సమర్పిస్తున్నాను అనే భావంతో పూజ చేయాలి.

పిదప ధూపం వేయాలి. అగరవత్తులు వెలిగించడం ద్వారా కాక, సాంబ్రాణి పొగ వేయాలి. ఈ ధూపం వలన పరిసర వాతావరణం శుభ్రమవుతుంది. ఆ తరువాత విగ్రహాన్ని ఆపాదమస్తకం పరిశీలించడం

కొరకు దీపాన్ని చూపించాలని, దూరంగా కూర్చున్నవారికి గూడ కనిపించడం కొరకు ఎక్కువ వత్తులు వేసి దీపాలను వెలిగించాలి.

ఈ ప్రపంచానికి యజమాని భగవంతుడు, ఆయన ఇవ్వడం వలననే మనకు ఆహారం లభిస్తుంది. ఆయన వలన వచ్చిన ఆహారాన్ని మొదలు ఆయనకు సమర్పించి పిదప దానిని మనం భుజించాలి. అందుకై మనం ఆనాడు భుజించబోయే వాటిని నైవేద్యంగా సమర్పించాలి. ఆ తరువాత తిన్న ఆహారాన్ని సక్రమంగా జీర్ణం చేసే గుణం తాంబూలానికి ఉన్నందువల్ల తాంబూలాన్ని సమర్పించాలి. పిదప నీరాజనమిచ్చి మంత్రపుష్పం చదువుతాము. హారతి యొక్క భావమేమిటంటే కర్పూరం తగ్గుతూ వెలుగు వృద్ధి చెందుతూ వుంటుంది. ఆ కర్పూరంలాగా పాపాలు హరించుకుపోవాలి. ఆ వెలుగువలె యజమాని ఆయుస్సు, తేజము వృద్ధిచెందాలని దీని భావము. భూత ప్రేత పిశాచాలు ఆ వెలుగును చూసి పారిపోతాయి. పిదప మంత్రపుష్పము చదువుతాము.

**మంత్రపుష్పం :-** ఇప్పటివరకు విగ్రహరూపంలో వున్న దేవతామూర్తిని దేవుడు వేరు, నేను వేరు అనే భావంతో పూజించాము. ఇప్పుడు దేవుడు నాలోనే వున్నాడు. దేవుడు నేనూ ఒక్కటే అనే అద్వైతభావం కలగడం కొరకు మంత్రపుష్పం చదువుతాము. మంత్రపుష్పాన్ని అర్థసహితంగా వింటుంటే శరీరము గగుర్పొదుస్తుంది. దేవుణ్ణి వర్ణిస్తూ అతడు సర్వవ్యాపి అని చెప్పబడింది. అతడు లోపల బయట గూడా వ్యాపించి ఉన్నాడు. అతడు అనంతుడు, అవ్యయుడు, సర్వము తెలిసినవాడు. ప్రతివ్యక్తిలోనూ ముడుచుకున్న కమలమువలె నాభికి పై భాగమునందు గుండెకు కుడివైపున హృదయ



కమలమున్నది. దాని అగ్రభాగాన అగ్నిశిఖయందు పసుపుపచ్చ వర్ణముతో వడ్లగింజ ముల్లువలె పరమాత్మ అణురూపంలో ఉన్నాడు అని వర్ణించబడినది.

పుష్పాలు చేతిలోనికి తీసుకొని మంత్రపుష్పం చదివాక దేవునికి సమర్పించి, నమస్కరించి ఆ పుష్పాలను శిరస్సుమీద వేసుకొన్నట్లయితే మొదట విగ్రహానికి ఆపాదించబడిన దైవశక్తి మనలో ప్రవేశిస్తుంది.

ఆ తరువాత ఆత్మ ప్రదక్షిణ చేయాలి. దేవుడు తనలోనే ఉన్నాడనే గ్రహింపు మంత్రపుష్పం ద్వారా కలిగింది. కనుక తనలో ఉన్న దేవుని చుట్టూ తిరగడం కొరకు ఆత్మప్రదక్షిణ చేస్తాం. ఈ విధంగా విగ్రహారాధనతో ఆరంభమైన పూజ సర్వత్రా వ్యాపించి ఉన్న నిరాకారుడైన పరమాత్మను అర్థం చేసుకోవడంతో ముగుస్తుంది.

**16వ ఉపచారం :**

రేపటి రోజు మళ్లీ పూజచేయడానికై దేవతామూర్తికి ఉద్వాసన చెబుతాం.

పంచభూతాత్మకమైనది ఈ ప్రపంచం. అందుచేత పంచభూతముల గుణములకు సంబంధించిన ఐదు పూజాద్రవ్యములను దేవునికి సమర్పిస్తాము. శబ్దానికి ఘంటానాదం స్పర్శకొరకు గంధము, రూపమునకు దీపం, వాసనకు ధూపం, రసమునకు నైవేద్యం సమర్పిస్తాము.

(గుంటూరు యువభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి “హిందూ ధర్మ వైభవం” సౌజన్యంతో)

శ్రద్ధ ఓం సాయి శ్రీసాయి జై జై సాయి సబూరి

## అఖండ సాయి సంకీర్తన ఏకాహం

### హృదయపూర్వక ఆహ్వానము

శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మరియు శ్రీ సాయిదర్శన్ సంపాదకులు శ్రీరావూజీగారి అధ్వర&యంలో శ్రీసాయిమయూరీ కళ్యాణమండపం, మదనపల్లి, చిత్తూరు జిల్లాలో అఖండ సాయి సంకీర్తన ఏకాహం.

2008 మార్చి 1వ తేదీ ఉదయం 9 గం॥ల నుండి మార్చి 2వ తేదీ 9 గం॥ల వరకు "ఓం సాయి శ్రీ సాయి జై జై సాయి" సంకీర్తన గావించబడును.

మనదేశంలోనే కాకుండా విదేశాలలో ఓం సాయి శ్రీసాయి జై జై సాయి అను ద్వాదశాక్షరి ఏకనామసంకీర్తన రథసారథి హైద్రాబాద్ వాస్తవ్యులు శ్రీ డి.శంకరయ్యగారి పరివేక్షణలో వారి శిష్యులు కదిరి వాస్తవ్యులు శ్రీ జి.సాంబమూర్తి బృందంవారిచే అఖండ సాయినామసంకీర్తన ఏకాహం భక్తిశ్రద్ధలతో సంకీర్తన గావించబడును.

### శ్రీషిరిడీ సాయి సత్యవ్రతములు

2008 ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 10 గం॥లకు శ్రీరాజేష్ స్వామి భక్తిశ్రద్ధలతో షిరిడీ సాయి సత్యవ్రతములు జరిపించబడును.

ఈ కార్యక్రమమునకు దంపతులు విచ్చేసి శ్రీషిరిడీ సాయిబాబావారి దివ్య అనుగ్రహ ఆశీస్సులు, కృపాకటాక్షములు పొందవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు
సదా సాయిసేవలో
**రావూజీ**

**గమనిక :** సాయి సత్యవ్రతమునకు విచ్చేయు దంపతులు తమ పేర్లను ఫిబ్రవరి 25వ తేదీలోగా నమోదు చేసుకొనవలెను ఈ క్రిందివారితో సంప్రదించవలసినదిగా కోరుచున్నాము.

| | |
|---|---|
| శ్రీమతి శ్రీదేవి | 08571231817 |
| శ్రీమతి మనోరమ | 08771230708 |
| శ్రీమతి ప్రసన్న | 9985725586 |



## ఏటిని విడిచిపెట్టాలి

లోకంలో మనిషి కొన్నింటిని ప్రోది చేసుకోవాలి, కొన్నింటిని వదులుకోవాలి. వేటిని ఎదలో పదిలపరచుకోవాలో, వేటిని ఎడగా నెట్టివేయాలో మనిషి తెలుసుకోవాలి. ఇదే వివేకం. ఈ వివేకముంటే మనిషి మనిషిగా మనగలుగుతాడు, మన్ననా పొందగలుగుతాడు. ఆ విడనాడవల్సినవేమిటో వినండి.

సోమరితనం, చాపల్యం, దురాశ, పరనింద, అనువుకాని కోపం, దురహంకారం ఈ ఆరింటినీ మనిషి వదులుకోవాలి.

మనిషికి వైయక్తికంగానూ, సామాజికంగానూ కొన్ని కర్తవ్యాలున్నాయి. అట్లాగే భౌతికంగానూ, పారమార్థికంగానూ కొన్ని విధులున్నాయి. ఏ రకంగా చూసినా కొన్ని కృత్యాలున్నాయి, కొన్ని అకృత్యాలున్నాయి. ఇవన్నీ ఎరిగి సకల విధాల కర్తవ్యాలు నిర్వహించి అకృత్యాలు విసర్జించినవాడే కృతకృత్యుడౌతాడు. వాని మానవజన్మ చరితార్థమౌతుంది.

ఎందులో ప్రవర్తించాలన్నా త్యాజ్యాలు ఉంటాయి. కొన్ని ఉపదేయాలూ ఉంటాయి. ముందు త్యాజ్యాలు తెలుసుకోవాలి. వాటిని విడిచిపెట్టాలి. అప్పుడు ఉపాదేయాలవైపు మనసు అనుకూలంగా ప్రసరిస్తుంది. వాటిని స్వీకరిస్తుంది.

అంచేత ఏ దృష్టితో కానీ మనిషి వదులకు తీరాల్సినవి ఆరున్నాయి. వాటిని తెలుసుకొని వదులుకొనే ప్రయత్నం చేయండి అంటున్నాడు నీతికారుడు.

### వాటిలో మొదటిది ఆలస్యం

తెలుగువారి ఆలస్యం కాదు. సంస్కృతం ఈ ఆలస్యం. ఆలస్యం అంటే సోమరితనం. ఇది కనపడకుండా చాపకింద నీరులా మనిషిని ఎదగకుండా లోతులకు తొక్కేస్తుంది. ఈ సోమరితనం మనిషికి లభించిన మహత్తరమైన కాలాన్ని కబళిస్తుంది. ప్రతిదీ "తరువాత" "తరువాత" అనిపింపచేస్తుంది. "తరువాత"

అన్నాడంటే "ఇహ సరి" అన్నమాటే.

పశ్చాచ్ఛబ్దో నాస్తి పర్యాయః అని సంస్కృతంలో ఓ ఆభాణకం ఉంది. ఈ సోమరితనం మనిషిని నిర్వీర్యుణ్ణి చేస్తుంది. కర్తవ్యం పట్ల ఉదాసీనుణ్ణి చేస్తుంది. దాంతో కర్తవ్యం కాస్తా కాలదోషం పట్టిపోయి కాలగర్భంలో కలిసిపోతుంది. చెయ్యాల్సినవి చెయ్యక జీవితమంత వ్యర్థంగా గడిపేసి ఎన్నో జన్మల పుణ్యఫలంగా లభించిన మానవజన్మను సదుపయోగపరచుకోలేక మనిషి భ్రష్టుపట్టిపోతాడు. అంచేత, "రేపన్నది నేడు, నేడన్నది ఇప్పుడు" అన్నట్లు మనిషి ఉండాలంటే ఆలస్యాన్ని దవ్వులకు తోలాలి.

**రెండోది లౌల్యం :**

అంటే చాపల్యం. మనిషికి ఉండే చాపల్యం ఇంతా అంతా కాదు. ఈ చాపల్యమూ ఎన్నో రకాలు. ప్రతి ఇంద్రియానికీ ఒక్కోరకం చాపల్యం. సరేసరి. మనస్సు మరీ చపలం. ఈ చాపల్యం వల్ల భావదార్ఢ్యం, ఆశయస్థైర్యం సడలిపోతాయి. లక్ష్యసాధనకు ఇది భంజకం కనుక చాపల్యాన్ని వదులుకోవాలి.

**మూడోది లోభం – దురాశ :**

మనిషికి ఆశ ఉండవచ్చు. ఉండాలి కూడాను. చదువుకోవాలని ఆశ. సంపాదించాలని ఆశ, సత్కృతులాచరించాలని ఆశ, ఇలా ఎన్ని ఆశలైనా ఉండొచ్చు. తప్పుకాదు. కాని దురాశమట్టుకు కూడదు. ఆత్యాశకంటేనూ చెడ్డది ఈ దురాశ.

ఎత్తులకు ఎదగాలనకోవడం ఆశ. అందరాని ఎత్తులకు ఎదగాలను కోవడం అత్యాశ. అందరాని ఎత్తులకు ఎగరాలను కోవడం దురాశ. ఇది మనిషిని లోతులను పాతేస్తుంది. దురాశ దుఃఖానికి చేటు కదా ! అంచేత దీన్ని వదులుకోవాలి.

**తరువాతది పరనింద :**

కొందరికి ఒరులను నిండించడమే జీవితాశయం. లేచింది మొదలు



పడుకునే వరకు ఎవరినో ఒకరిని ఆడిపోసుకోవడమే వీరిపని. ఇది మంచిది కాదు. చెదలు కొరికనట్లు లోపల్లోపల ఇది వీణ్ణి తినేస్తుంది. పరనింద వల్ల వీడికొచ్చేది ఏమీ లేదు. మనస్సు అపమార్గంలోనే నడవటానికి అలవాటు పడిపోతుంది. కడకు వీడి బతుకు పెడదోవనే పడుతుంది. ఈ స్వభావమువల్ల వీడు తన నాశాన్ని తానే తెచ్చుకొన్నవాడౌతాడు. కనుక దీన్ని వదులుకోవాలి.

**అస్థానకోపం ఐదోది :**

అనువుకాని వేళ కోపం పనికిరాదు. అనువుకాని వ్యక్తులపై కోపం పనికిరాదు. కోపానికి సమయా సమయాలుంటాయి. తప్పుచేసేదు కోపం వచ్చింది. ఇక్కట్టుల్లో ఉన్నాడు, అక్కడ అప్పుడు కోపం చూపరాదు.

ఎవరో ఒక పెద్దాయన మీద పట్టరాని కోపం వచ్చింది. ప్రయోజనం? పేదవాడి కోపం పెదవికి చేటు. వీడు పేద, అన్ని రకాలుగానూ కోపం వచ్చింది. కాని, అవతల ఆ కోపం ప్రదర్శించే వీలులేదు. చోటుకాదు. కాని, కోపం ఉండనీయటం లేదు. శివజటాజూటంలో సుడులు తిరుగుతున్న వియద్గంగలా ఎగిసి ఎగిసి పడుతుంది. దాన్ని ఎంతసేపు బిగపడతావు? నీకు లొంగి ఎంతసేపు పడి ఉంటుంది? నీ పెదవిని కాటు వేస్తుంది. గాటు వేస్తుంది. సరి దాని పని. ఏమొరిగింది నీకు? ఆ కోపమెందుకు నీకు? అంచేత అనువుకాని కోపం పనికిరాదు. దాన్ని వదిలేయ్.

**చివరిది దురహంకారం**

అహంకారమే చెడ్డదంటారు. తనమీద అతి విశ్వాసం అహంకారం, తనమీద అతి విశ్వాసంతో పాటు అవతలివారిపై ఎల్లిదపు చూపు దురహంకారం. నువ్వు చెయ్యగలననుకుంటే చేసుకో. కాని, ఆ అనుకోవడంలో అవతలి వారికి కించపరచకూడదు. ఇది సుతారమూ మంచిదికాదు.




## గుంటూరు జిల్లా

గుంటూరులోగల బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణములో శ్రీషిరిడీసాయిబాబా 90వ మహాసమాధి మహోత్సవము, సాయిభక్త మహా సమ్మేళనము సద్గురు సాయినాథమహరాజ్‌వారి దివ్యఆశీస్సులతో ది.26-01-2008, 27-01-2008 జరిగినవి. 26-01-08 ఉదయం 6 గం॥లు కాకడ ఆరతి, అభిషేకరం, నామజపం, 9 గం॥ల నుండి శ్రీ డి.శంకరయ్య శ్రీరావుజీ హైద్రాబాద్‌వారిచే అఖండజ్యోతి ప్రజ్వలన, మహాసమాధి అనంతరం సాయినాథ వైభవం సత్సంగము, ప్రారంభకులు శ్రీ డి.హెచ్. ఇనామ్‌దార్, ట్రస్టీ, సాయిబాబా సంస్థాన్, షిరిడీ శ్రీ విఠలానంద సరస్వతి మహరాజ్, శ్రీ ఆర్.శేషాద్రి, బెంగుళూరు, డా॥ జె.సురేష్‌బాబు,ఐ.ఎ.యస్, టోబాకో బోర్డు, శ్రీ వేదానంద సరస్వతి, శ్రీ పి.యస్.మోహటన్, పాట్నా, శ్రీవంశీరామరాజు, గురుస్వామి శ్రీ మన్నవ సత్యం, శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ మొదలైన మహనీయులు విచ్చేసి వారి ప్రసంగములు భక్తులకు అందించినారు.

## తూర్పుగోదావరి జిల్లా :

ధవళేశ్వరం అగ్రహారంలో శ్రీ డి.శివరామయ్యగారి ఇంటివద్ద శ్రీ షిరిడీ సాయిసేవాసమితి, బచ్చువారి వీధి, రాజమండ్రివారిచే శివరామయ్యగారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా శ్రీసాయి సత్సంగం 20-01-08,ఆదివారం సాయంత్రం నిర్వహించిరి. విఘ్నేశ్వరపూజ, సాయి అష్టోత్తర పూజ, సాయిసచ్చరిత్ర ఒక



అధ్యాయం పారాయణ, ధ్యానం, భజన కార్యక్రమములు ఘనముగా నిర్వహించబడినవి. శ్రీసాయిదర్శన్ మాసపత్రికలు శ్రీదాసగణూకృత స్తవన మంజరి పుస్తకాలు, శ్రీసాయి ఆదేశాలు, శ్రీసాయి దివ్యరసామృతాలు, శ్రీ పి.వీరభద్రరావు మరియు శ్రీ కె.వి.శ్రీనివాస్‌లచే పంపిణీ చేయబడినవి. అనంతరం భక్తులకు ప్రసాదములు పంపిణీచేయబడినది.

(పి.వీరభద్రరావు, శ్రీసాయిదర్శన్ ప్రచార ప్రతినిధి వేమగిరి

## చిత్తూరు జిల్లా

పీలేరులో ది.05-02-2008 నుండి 07-02-2008 వరకు శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబావారి ఆలయంలో పంచమ వార్షికోత్సవము జరిపించినారు. 05-02-2008 తేదీన గంగపూజ, వరుణపూజ, మహాగణపతి పూజ, కలశస్థాపన 06-02-2008 ప్రాతకాలపూజ, జపపారాయణగాదులు రుద్రాభిషేకము, మహాగణపతి,నవగ్రహ, శ్రీదత్తహోమములు, షోడశోపచారపూజ, 07-02-2008 అభిషేకము, శ్రీసాయి సహస్రనామార్చన, సుదర్శన, లక్ష్మీ, శ్రీసూక్తహోమములు జరిపించినారు.

## కర్నాటక :

బెంగుళూరు త్యాగరాజ నగర్‌లోగల శ్రీసాయి స్పిరిట్యూవల్ సెంటర్‌లో సద్గురు సాయి పదానంద రాధాకృష్ణస్వామీజీ 28వ క్రాసు ఆరాధన ది.01-02-2008 నుండి 03-02-2008 వరకు జరుపబడినది. కల్చరల్ ప్రోగ్రాములు సత్సంగ డివోటీస్ అనుభవాలు శ్రీ ఆర్.శేషాద్రి ప్రెసిడెంట్‌గారి ఆధ్వర్యంలో జరిగినవి.

## సాయిప్రబోధ ప్రచారమునకు, అన్నదానం కొరకు పంపినదాతల పేర్లు

| | | |
|---|---|---|
| శ్రీ ఐ.వెంకటరమణ | ఆముదాలవలస | 108-00 |
| శ్రీ ఆర్.మునిస్వామి | వాయల్‌పాడు | 108-00 |
| శ్రీమతి టి.మీరా | రామచంద్రపురం | 111-00 |
| శ్రీ ఎ.పి.రంగారావు | అడ్డతీగల | 58-00 |
| శ్రీ లక్కోజు జనార్ధనాచార్య | కాశీబుగ్గ | 116-00 |
| శ్రీమతి వై.సుగుణమ్మ | రావూరు | 108-00 |
| శ్రీ టీకేటివేణుగోపాలరావు | టెక్కలి | 1001-00 |
| శ్రీ జి.మస్తానయ్య | కావలి | 116-00 |
| శ్రీ కె.కృష్ణయ్యశెట్టి | రామసరపురం | 200-00 |
| శ్రీ యమ్.వి.వి.యస్.కుమార్‌రాజు | - | 200-00 |
| శ్రీమతి టి.డి. ఉమామహేశ్వరి | విశాఖపట్నం | 116-00 |
| శ్రీ యన్. బస్వరామయ్య | - | 116-00 |
| శ్రీ భారతి రంగసాయి | మైసూరు | 200-00 |
| శ్రీ టి.శివరామకృష్ణ | గుంతకల్ | 516-00 |
| శ్రీ యమ్.ప్రసన్నసాయి | రాజంపేట | 111-00 |
| శ్రీ ప్రసాద్ | గుంటూరు | 111-00 |
| శ్రీమతి పి.పద్మావతి | నర్సాపూర్‌ప॥గో॥ | 200-00 |
| శ్రీ యం.సుబ్రహ్మణ్యశాస్త్రి | అరట్లకట్ట | 108-00 |
| శ్రీ ఎ.నరసింహారావు | నందవెలుగు | 108-00 |
| శ్రీమతి కె.విమల | - | 111-00 |
| శ్రీ వి.కె.సుష్మప్రసాద్ | బెంగుళూరు | 116-00 |
| శ్రీమతి వి.కె. లక్ష్మీదేవి | మదనపల్లి | 116-00 |
| శ్రీ కె.యస్.యం.కుమార్ | కొండుఅగ్రహారం | 100-00 |
| శ్రీ ఎ.రవీంద్రబాబు | హైద్రాబాద్ | 111-00 |
| శ్రీమతి కె.శైలజ | హైద్రాబాద్ | 111-00 |

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**